# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 12

ఆదివారం, 22 సెప్టెంబర్, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD



## తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యాలు భేష్

**ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ప్రశంస.. రాష్ట్రానికి సహకరించేందుకు ఆసక్తిగా ఉన్నామని ప్రకటన**

**హైదరాబాద్:** తెలంగాణ అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలు బాగున్నాయని ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ప్రశంసించింది. గత నెలలో వాషింగ్టన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగాతో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ

## కాంగ్రెస్ నేతలు అర్బన్ నక్సల్సా?

**ప్రధాని మోదీ వ్యాఖ్యలు సరికావు: భట్టి**



**హైదరాబాద్, సెప్టెంబరు 21:** కాంగ్రెస్ పార్టీ నేతలను అర్బన్ నక్సల్స్, విభజనవాదులు, అవినీతిపరులు అని ప్రధాని మోదీ అనడం ఆయన స్థాయికి తగదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘమైన జాతీయోద్యమ నేపథ్యం, త్యాగాలు – మిగతా 2వ పేజీలో

# రాజకీయ అధిపత్యం కోసమే జమిలి ముసుగు

**ఈ ముసుగులో దేశాన్ని కబళించాలని భాజపా చూస్తోంది**

**సీతారాం ఏచూరి విధానాలతో ఆ ప్రయత్నాల్ని తిప్పికొట్టాలి**

**సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

**కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్ సహా పలువురు భారాస నేతలు**



**హైదరాబాద్:** 'భాషలు, ప్రాంతాలు, ప్రజల మధ్య చిచ్చుపెట్టి అధికారాన్ని నిలబెట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఒకే దేశం..ఒకే ఎన్నిక పేరుతో, జమిలి ఎన్నికల ముసుగులో భాజపా దేశాన్ని కబళించాలనే కుట్ర చేస్తోంది. సీతారాం ఏచూరి విధానాలతో ఈ ప్రయత్నాల్ని నిలువరించాలి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశ ఐక్యతను దెబ్బతీసేందుకు భాజపా చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా పోరాడుదామని అన్నారు. సీపీఎం దివంగత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శనివారం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తదితరులు ఏచూరికి ఘనంగా నివాళి అర్పించారు. ప్రసంగించి.. కొద్దిసేపు ఉండి కేటీఆర్ వెళ్లిపోగా ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి వచ్చారు. ఏచూరి రచించిన వర్తమాన రాజకీయాల్లో కులము-వర్గము పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ- దేశంలో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు జమిలి ఎన్నికల పేరుతో కేంద్రం చేస్తున్న ప్రయత్నాల క్రమంలో ఏచూరి లేకపోవడం తీరని నష్టమని వ్యాఖ్యానించారు. రాష్ట్రాల హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందనీ.. భాజపా చేస్తున్న ప్రయత్నాల్ని తిప్పికొట్టాలని అభిప్రాయపడ్డారు. "భాజపా, ఆ పార్టీకి అనుకూలంగా ఉండే శక్తుల్ని నిలువరించేందుకు కాంగ్రెస్, వామపక్షాలు కలిసి పనిచేసేలా నిర్ణయాలు తీసుకోవడంలో ఏచూరి కీలక భూమిక పోషించారు. భూతద్దం పెట్టి వెతికినా ఆయన వంటి వారు కనిపించడం చాలా కష్టం. రాహుల్‌గాంధీతో ఆయనకు చాలా మంచి సంబంధాలున్నాయి. పేదల పక్షాన గళం విప్పిన ఆయన లేకపోవడం తీరనిలోటు. నేను పీసీసీ అధ్యక్షుడిని అయ్యాక ఆయనతో రెండుసార్లు మాట్లాడా. ఆయనతో మాట్లాడితే కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డితో మాట్లాడినట్లు అనిపించేది. నమ్మిన సిద్ధాంతం కోసం ఆఖరి శ్వాస వరకు నిలబడ్డారు" అని గుర్తుచేసుకున్నారు. జాతీయ రాజకీయాల్లో తెలుగువారి సంఖ్య క్రమేణా తగ్గుతోందనీ, దిక్సూచిగా ఉండాల్సిన సమయంలో ఏచూరి లేకపోవడం బాధాకరమని, సమాజానికి తీరని నష్టమని సీఎం అన్నారు.

### పది రోజుల్లోనే కమ్యూనిస్టు పార్టీలో చేరారు...

ఉమ్మడి ఏపీ ప్రభుత్వ మాజీ సీఎస్ మోహన్ కందా మాట్లాడుతూ.. ఏచూరిని రాజకీయాల నుంచి విరమింపజేయడంలో తాను విఫలమయ్యానన్నారు. "ఏచూరికి – మిగతా 2వ పేజీలో

## మా బంధం ఉద్యమాల రక్తసంబంధం: కేటీఆర్




'నమ్మిన సిద్ధాంతం కోసం సీతారాం ఏచూరి ఆఖరివరకు కట్టుబడ్డారు. మాలాంటి కొత్తతరం నాయకులకు ఆయన జీవితం ఆదర్శం' అని కేటీఆర్ అన్నారు. ఉన్నత చదువుల కుటుంబం నుంచి వచ్చినా అణగారినవర్గాల కోసం నిలబడ్డారని, ప్రశ్నించడమే ప్రజాస్వామ్యం అని గుండెల నిండా నమ్మిన గొప్ప వ్యక్తిత్వం ఆయనది అని కొనియాడారు. 'పదవుల చుట్టూ తిరిగే నేటి రాజకీయాల్లో స్థిరంగా, నిబద్ధతతో నిలబడ్డారు. కండువా మార్చకుండా కడదాకా కమ్యూనిస్టుగా బతికిన ఆదర్శనేత' అని ప్రస్తుతించారు. 'మా పార్టీలు, సిద్ధాంతాలు వేరుకావచ్చు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భిన్నాభిప్రాయం ప్రకటించి ఉండొచ్చు. కానీ ఉద్యమాల నుంచి వచ్చిన బిడ్డలుగా మా బంధం రక్తసంబంధం. రాజ్యాంగం అపహాస్యమైన సందర్భాల్లో ఏచూరి స్ఫూర్తితో ప్రశ్నిస్తూనే ఉంటాం. చనిపోయాక కూడా ఉపయోగపడాలంటూ తన దేహం వైద్యులకు ఉపయోగపడాలనే ఆయన ఆశయం గొప్పది' అని అన్నారు.

# సంచలనంగా మార్చొద్దు

- తిరుమల లడ్డూ విషయంలో రాజకీయ పార్టీలు, ధార్మిక సంస్థలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి
- హిందూ ధార్మిక విశ్వాసాలను దెబ్బతీసే కుట్రలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని సర్కారుకు సూచన



**హైదరాబాద్:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న అంశాన్ని సంచలనాత్మకంగా మార్చొద్దని రాజకీయ పార్టీలు, ధార్మిక సంస్థలకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సనాతన ధర్మాన్ని, హిందూ ధార్మిక విశ్వాసాలను దెబ్బతీసే కుట్రలు గతంలోనూ జరిగిన నేపథ్యంలో వాటన్నింటిపై సమగ్ర దర్యాప్తు జరిపించి బాధ్యులను శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రమైందన్న వార్తలతో భక్తుల నమ్మకం, విశ్వాసం సడలే ప్రమాదం ఉందని కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పార్టీలు, ధార్మిక సంస్థలు బాధ్యతతో వ్యవహరించి సంయమనం పాటించాలని ఓ ప్రకటనలో సూచించారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి – మిగతా 2వ పేజీలో

# రూ. 8,888 కోట్ల

## 'అమృత్' పనుల్లో అవినీతి




- సీఎం బావమరిది కంపెనీకి అనుచిత లబ్ధి
- అర్హత లేకున్నా.. రూ వేల కోట్ల పనులు
- అవినీతి నిరోధక చట్టం సెక్షన్ల మేరకు రేవంత్ అనర్హుడు
- బీజేపీ స్పందించకుంటే కుమ్మక్కు అయినట్టు భావిస్తాం
- రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సకుటుంబ అవినీతి కథా చిత్రం నడుస్తోంది
- దీన్ని ధారావాహికంగా బయటపెడతాం:కేటీఆర్

**హైదరాబాద్:** తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి సకుటుంబ సపరివార అవినీతి కథాచిత్రం నడుస్తోందని..అనేక కుంభకోణాలకు ఆయన కుటుంబసభ్యులే కేంద్రంగా ఉంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మున్సిపాలిటీల్లో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ కోసం కేంద్ర ప్రభుత్వం 'అమృత్'పథకం కింద రాష్ట్రానికి – మిగతా 2వ పేజీలో

# అమృత్‌లో అవినీతి నిరూపిస్తే రాజీనామా!

**నిరూపించకపోతే.. కేటీఆర్‌పై చట్టరీత్యా చర్యలు**

- రూ.8,888 కోట్ల అవినీతి ఎక్కడో చర్చిద్దాం
- పోలింగ్ ముందురోజు టెండర్లు తెరిచింది మీరు
- 3 కంపెనీలకు అదనానికి కట్టబెట్టారు
- మేం వచ్చాక రద్దుచేసి 2.44% తక్కువకే ఖరారు
- సృజన్‌రెడ్డి రేవంత్‌కు సొంత బావమరిది కాదు
- బీఆర్ఎస్ సొంత మనిషి, కందాళ అల్లుడు
- కేటీఆర్‌పై రెవెన్యూ మంత్రి పొంగులేటి ధ్వజం



**హైదరాబాద్, సెప్టెంబరు 21:** అమృత్ పథకం నిధుల్లో రూ.8888 కోట్ల అవినీతి జరిగిందని కేటీఆర్ చేసిన ఆరోపణలను రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా ఖండించారు. కేటీఆర్ తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ ఆరోపణలు నిజమని తేలితే మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. అబద్ధమని తేలితే కేటీఆర్ ఎమ్మెల్యే పదవికి స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తారా? అని సవాలు విసిరారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సచివాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కంటే తక్కువ అంచనాలతో కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లు పిలిచిందని చెప్పారు. ఈ అంశంపై బహిరంగ చర్చకు ఎక్కడికైనా వస్తానని ప్రకటించారు. పరిపాలనా అనుమతి ఇచ్చిందే రూ.3516 కోట్లకు అని, పన్నులు, ఇతరత్రా కలిపినా రూ.5385 కోట్లు అవుతుందని పొంగులేటి ప్రస్తావించారు. రూ.8,888 కోట్ల ఫిగర్ ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించారు. నేరుగా నిధులు మంజూరు చేసినట్లు ఉత్తర్వులు వచ్చాయా? అని ప్రశ్నించారు. మిడిమిడి జ్ఞానంతో విమర్శలు చేయవద్దని హితవు పలికారు. పదేళ్ల పాటు అబద్ధాలతో ప్రజలను వంచించారని, ప్రతిపక్షంలో కూడా అబద్ధాలు ఆడితే ఈ హోదా కూడా పోతుందని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు పురపాలక మంత్రిగా పనిచేసిన కేటీఆర్ ప్రస్తుత పురపాలక – మిగతా 2వ పేజీలో

## బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

**పీఏసీ సమావేశంలో గందరగోళం..**



**హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ కమిటీ హాల్‌లో చైర్మన్ అరికెపూడి గాంధీ అధ్యక్షతన పీఏసీ మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సభ్యుల ప్రశ్నలతో గందరగోళం నెలకొంది. అనంతరం, బీఆర్ఎస్ సభ్యులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. కాగా, పీఏసీ చైర్మన్ గాంధీ అధ్యక్షతన నేడు మొదటి – మిగతా 2వ పేజీలో

# కాళేశ్వరం నీళ్లా? ఎల్లంపల్లి వాటరా?.

**హరీష్ హార్డ్ వర్కర్.. మాకు సలహాలు ఇవొచ్చు: మంత్రి పొన్నం**



**హైదరాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు ప్రశ్నలకు ఆయనే సమాధానం చెప్పాలన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. మల్లన్న సాగర్‌కు వచ్చిన నీళ్లు కాళేశ్వరం వాటరా? లేక ఎల్లంపల్లి నీళ్లా? అనేది హరీష్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ఇరిగేషన్ మాజీ మంత్రిగా హరీష్.. ప్రభుత్వానికి సూచనలు ఇవ్వొచ్చు అంటూ కామెంట్స్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం మీడియాతో మాట్లాడుతూ..'ఎమ్మెల్యే హరీష్ రావు హార్డ్ వర్కర్, ఆయనకు కష్టపడేతత్వం ఉంది. అబద్దాలతో ప్రజలను మేనేజ్ చేస్తామంటే కుదరదు. రాజకీయం చేయడం మా ప్రాధాన్యత కాదు. రైతులకు నీళ్లు ఇవ్వడమే మాకు ముఖ్యం. హరీష్ ప్రశ్నలకు ఆయనే సమాధానం చెప్పాలి. మలన్నసాగర్‌కు వచ్చిన నీళ్లు ఎక్కడివి?. ప్రభుత్వం తరపున హరీష్ రావును అడుగుతున్నాను. నీళ్లు ఎక్కడి నుంచి వచ్చాయి. బీఆర్ఎస్ నిర్లక్ష్యం వల్ల జరిగిన నష్టాన్ని మేనేజ్ చేసేందుకు హరీష్ ప్రయత్నం చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ మాజీ మంత్రిగా ప్రభుత్వానికి ఆయన సలహాలు ఇవ్వొచ్చు. సూచనలు కూడా చేయవచ్చు. ఎల్లంపల్లి ప్రాజెక్టు కిరణ్ కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడే పూర్తి అయ్యింది. ఎల్లంపల్లి ప్రారంభోత్సవానికి వస్తానని కిరణ్ కుమార్ – మిగతా 2వ పేజీలో

## అధికారులు మాట వినడం లేదట!.. టీపీసీసీ చీఫ్‌కు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

**హైదరాబాద్:** అధికారులు తమ మాట వినడం లేదంటూ కాంగ్రెస్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. అధికారంలో ఉన్నామో.. ప్రతిపక్షంలో ఉన్నామో అర్థం కావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అధికారుల వ్యవహారాన్ని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులకు మహేష్‌గౌడ్ అప్పగించారు. కాగా, రేపు సా.4 గంటలకు రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మాదాపూర్ రాడియంట్ హోటల్‌లో సీఎల్పీ సమావేశం జరగనుంది. ఈ భేటీలో సీఎం కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. లోకల్ బాడీ – 2వ పేజీలో

# ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలు చేపట్టాలి

### ప్రభుత్వ దవాఖానాల్లో 'బయోమెట్రిక్'

### మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలు



**హైదరాబాద్:** రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ప్రభుత్వ టాస్క్‌ఫోర్స్ కమిటీలు నిత్యం తనిఖీలు చేపట్టి ప్రతినెల తనకు నివేదిక ఇవ్వాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. అలాగే ప్రభుత్వ దవాఖానాల్లో బయోమెట్రిక్ ద్వారా హాజరును నమోదుచేయాలని ఆదేశాలు జారీ చేశారు. శనివారం సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి మాట్లాడారు. వైద్యారోగ్య శాఖలోని అన్ని విభాగాల శాఖాధిపతులు నెలకు కనీసం రెండు సార్లు జిల్లాల్లోని ఆసుపత్రులను సందర్శించి వైద్య సిబ్బంది హాజరు, పరికరాలు, మందులు, పారిశుద్ధ్య నిర్వహణ తదితరాలను పరిశీలించాలన్నారు. "ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లోని డైట్ క్యాంటీన్లను ఫుడ్ సెక్యూరిటీ అధికారులు తరచూ తనిఖీ చేయాలి. ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగులకు చికిత్సలు సరిగా అందుతున్నాయా? అధిక రుసుం వసూలు చేస్తున్నారా? తదితర అంశాలను టాస్క్‌ఫోర్స్ కమిటీలు పరిశీలించాలి. ప్రభుత్వ దవాఖానాలు రోగులకు మెరుగైన వైద్యం అందించాలి. రోగ నిర్ధారణ పరికరాలు, ఔషధాలు అందుబాటులో ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో గర్భిణులను ప్రసవ అంచనా తేదీ కంటే వారం రోజుల ముందే సమీప ఆసుపత్రులకు తరలించి వైద్యసేవలు అందించాలి"అని మంత్రి ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, డీఎంఈ వాణి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, ప్రజారోగ్య సంచాలకుడు రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యాలు భేష్


మొదటి పేజీ తరువాయి



నేపథ్యంలో తదుపరి చర్చల కోసం ప్రపంచ బ్యాంకు దక్షిణాసియా ప్రాంత ఉపాధ్యక్షుడు మార్టిన్ రైజర్ నేతృత్వంలో కంట్రీ ఆపరేషన్ హెడ్ పాల ప్రోసి, అర్బన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు లీడ్ నటాలియా, డిజిటల్ డెవలప్‌మెంట్ సీనియర్ స్పెషలిస్టు మహిమాపత్ రే శనివారం హైదరాబాద్ వచ్చారు. రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో వారు సమావేశమయ్యారు. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యం, సాగునీటి రంగాలను తమ ప్రభుత్వ ప్రాధాన్యాంశాలుగా పెట్టుకున్నామని, ఆయా రంగాల్లో తాము తీసుకుంటున్న చర్యలను వారికి సీఎం వివరించారు. అత్యుత్తమ ప్రమాణాలతో తెలంగాణ ప్రాజెక్టులు నిలిచేందుకు ఆర్థికంగా సహకరించాలని కోరారు. విద్య, వైద్య రంగాల్లో సీఎం దార్శనికత బాగుందని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని పేర్కొన్నారు. సమావేశంలో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, ఆయా శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు తక్షణ సాయమందించండి

### సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు లేఖ



**హైదరాబాద్, సెప్టెంబరు 21:** వరద బాధితులందరికీ తక్షణ సాయం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ రాశారు. 'ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. ఖమ్మం, భద్రాచలం, మహబూబాబాద్, సూర్యాపేట, వరంగల్‌తో పాటు పలు జిల్లాల్లో వరద ఉధృతి బీభత్సాన్ని సృష్టించింది. అధికారిక లెక్కల ప్రకారం 33 మంది ప్రాణాలు కోల్పోయారు. రూ.5,438 కోట్ల ఆస్తి నష్టం, 4.25 లక్షల ఎకరాల్లో పంట నష్టం సంభవించింది. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలకు తగ్గకుండా సాయం చేయాలి. పూర్తిగా ఇళ్లు కొట్టుకుపోయిన వారికి రూ.10లక్షల సాయం, పంట నష్టం కింద ఎకరాకు మీరు గతంలో డిమాండ్ చేసినట్లుగానే రూ.25వేల సాయం అందించాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు. కాగా, సింగరేణి కార్మికుల దసరా బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం బోగస్ చేసిందని హరీశ్ విమర్శించారు. కార్మికులకు రూ.1550కోట్లు రావాల్సి ఉండగా.. రూ.795 కోట్లతోనే సరిపెట్టిందని ధ్వజమెత్తారు.

# ఫార్మాసిటీ రద్దు కాలేదు..

### ఇప్పటికీ అమల్లోనే 2016 నాటి ఫార్మాసిటీ జీవో31

### భూసేకరణ నోటిఫికేషన్ రద్దుపై అప్పీళ్లు దాఖలు

### హైకోర్టులో రెవెన్యూ ముఖ్యకార్యదర్శి అఫిడవిట్

**హైదరాబాద్, సెప్టెంబరు 21:** గతంలో ప్రతిపాదించిన ఫార్మాసిటీ రద్దు కాలేదని రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ స్పష్టం చేశారు. గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొంటూ.. హైకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. గతంలో చేపట్టిన భూసేకరణ రద్దు కాలేదని.. సేకరించిన భూములను మళ్లీ పిటిషనర్ల పేరుతో రెవెన్యూ రికార్డులను సవరించడం సాధ్యం కాదని అందులో స్పష్టం చేశారు. "ఫార్మాసిటీని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుందని పేర్కొంటూ పత్రికల్లో కథనాలు వచ్చాయి. భూసేకరణ కూడా రద్దయిందనే పిటిషనర్ల వాదనలో నిజం లేదు. ఆ వాదనను ప్రభుత్వం తిరస్కరించింది. వార్తాపత్రికల కథనాలను పిటిషనర్లు సమర్పించారు. అవి ఎప్పటికీ సాక్ష్యాధారాలు(ఎవిడెన్స్)గా పనికిరావు. అవి కేవలం 'హియర్ సే ఎవిడెన్స్'లు మాత్రమేనని పలు సందర్భాల్లో కోర్టు తీర్పులున్నాయి. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామం వద్ద హైదరాబాద్ ఫార్మాసిటీ ఏర్పాటుకు సంబంధించిన 2016 జూన్ 10న పరిశ్రమల శాఖ ఇచ్చిన జీవో 31 రద్దు కాలేదు. ఇప్పటికీ అది అమల్లోనే ఉంది. ఆ జీవోను అమలుచేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పిటిషనర్లు పేర్కొంటున్నట్లుగా భూసేకరణ ప్రొసీడింగ్స్‌కు కాలంచెల్లిపోలేదు. నూతన భూసేకరణ చట్టం–2013 ప్రకారం భూసేకరణ చేపట్టిన నేపథ్యంలో సదరు భూములకు సంబంధించి ఎలాంటి లావాదేవిలు జరగవు. లావాదేవీలకు సంబంధించిన స్లాట్‌లు బుకింగ్‌లకు ఆస్కారం ఉండదు. గ్రీన్ ఫార్మాసిటీ కోసం ఇప్పటికే మెజారిటీ భూముల సేకరణ పూర్తయింది. ప్రస్తుత దశలో ఈ కోర్టు(సింగిల్ బెంచ్) జోక్యం చేసుకుంటే రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉద్దేశించిన గ్రీన్ ఫార్మాసిటీ ప్రాజెక్టుపై తీవ్ర వ్యతిరేక ప్రభావం ఉంటుంది. పిటిషనర్ల భూములను సేకరించి.. పరిహారానికి సంబంధించిన అవార్డు జారీచేశాం.

# రాజకీయ అధిపత్యం కోసమే జమిలి ముసుగు

మొదటి పేజీ తరువాయి

ఐదు రోజుల పాటు ఉపనయన క్రతువు నిర్వహించారు. ఆ తర్వాత పది రోజుల్లోనే ఆయన కమ్యూనిస్టు పార్టీలో చేరారు. మేమిద్దరం మేనమామ, అల్లుళ్లం అయినా అన్నదమ్ముల్లా ఉండేవారం. ఎమర్జెన్సీ సమయంలో నేను కర్నూలు కలెక్టర్‌గా పనిచేస్తున్నా. అప్పుడు ఏచూరి నా దగ్గరే ఉన్నారు. 'మామా..మీరు కమ్యూనిజంలోకి వస్తే బాగుంటుంది' అని అన్నారు. సీతారాంను తీసుకెళ్లకపోతే నేను కమ్యూనిస్టును అయిపోతానేమో అని మా వాళ్లతో అన్నా" అని చెప్పుకొచ్చారు.

**దేశాన్ని కాపాడుకోవాలి**

కేంద్రం తీరు నియంత హిట్లర్‌ను తలపిస్తోందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మండిపడ్డారు. "ఒకే దేశం–ఒకే ఎన్నికతో ఖర్చు తగ్గుతుందట.. ఏం తగ్గదు. నేరస్థులను జైల్లో పెట్టడం, వారికి భోజనం పెట్టడం వల్ల ఖర్చు పెరుగుతుందని వారిని కాల్చి చంపాలని హిట్లర్ అప్పట్లో అన్నారు. ఎన్డీయే తీరూ ఎన్నికల విషయంలో ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేలా ఉంది. దేశాన్ని ముక్కలు



కాకుండా కాపాడుకోవాలి. సీతారాం వంటి వ్యక్తులు తయారుకావాలి' అని అన్నారు. తెజస అధ్యక్షుడు కోదండరాం మాట్లాడుతూ– దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య విలువల్ని నిలబెట్టడంలో ఏచూరి గొప్ప కృషి చేశారని అన్నారు. ప్రజాస్వామిక విలువలున్న అన్ని పార్టీల్ని ఒకే వేదికపై తెచ్చారని కొనియాడారు. ఏనాటికైనా ఎర్రజెండాలన్నీ ఒక జెండా కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. 'ఏచూరి మరణం పెద్ద కుదుపు. ఆయన ప్రతి పలుకూ బంగారమే. కమ్యూనిజానికి ఎంతో అభిమానం తెచ్చిన నాయకుడు' అని కీర్తించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ– సమాజానికి ఎంతో ఉపయోగపడే మేధస్సున్న మహనీయుడు ఏచూరి అని అన్నారు. ఓట్లు, సీట్ల లెక్కల్ని పక్కనపెడితే కమ్యూనిస్టులు లేకపోతే ఈ దేశానికి భవిష్యత్ ఉందా అన్న చర్చ జరుగుతోందన్నారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ– లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిపాలన కోరుకునేవారందరికీ ఏచూరి మరణం తీరని లోటన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, వామపక్షాల నాయకులు వీరయ్య(సీపీఎం), పోటు రంగారావు (సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్), వేములపల్లి వెంకట్రామయ్య (సీపీఐ న్యూడెమోక్రసీ), వనం సుధాకర్ (ఎంసీపీఐ–యు), ప్రసాదన్న (సీపీఐ ఎంఎల్), జానకిరాములు (ఆర్ఎస్‌పీ), మురహరి (ఎస్‌యూసీఐ–సి), రమేశ్ (సీపీఐ ఎంఎల్ లిబరేషన్), తేజ్‌దీప్‌రెడ్డి (ఫార్వార్డ్ బ్లాక్) తదితరులు హాజరయ్యారు.

# అమృత్‌లో అవినీతి నిరూపిస్తే రాజీనామా!

మొదటి పేజీ తరువాయి

మంత్రి అయిన ముఖ్యమంత్రిపై దురుద్దేశ పూర్వకంగా తప్పుడు ఆరోపణలకు పాల్పడ్డారని, వాటిని నిరూపించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ప్రకటించారు. పరువునష్టం దావా కూడా వేస్తామన్నారు. రాష్ట్రంలో 98 ప్రాంతాల్లో పనులు చేసేందుకు 2023 సెప్టెంబరు 20న గత ప్రభుత్వం టెండర్లు పిలిచిందని పొంగులేటి తెలిపారు. తెల్లవారితే పోలింగ్ ఉండగా నవంబరు 29న ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే రూ.3,515 కోట్ల బిడ్‌ను ప్రభుత్వం తెరిచిందని చెప్పారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే లోపే 3.99 శాతం అదనానికి మూడు కంపెనీలకు కట్టబెట్టిందన్నారు. మూడింటిలో ఒకటి ఆంధ్రప్రదేశ్ వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్ఆర్ అని, మరొకటి గజా కన్‌స్ట్రక్షన్, మూడోది మేఘా అని తెలిపారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రీ టెండర్లు**

డిసెంబరు 7న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ టెండర్ల విషయం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి రావడంతో వాటిని రద్దు చేసి.. పాత ఎస్ఎసఆర్ ధరల ప్రకారమే మళ్లీ టెండర్లు పిలిచామని పొంగులేటి వెల్లడించారు. కేఎన్ఆర్ జాయింట్ వెంచర్, ఇంకొకటి ఏఎమ్మార్ ఇండియా లిమిటెడ్, సోదా కంపెనీలకు టెండర్లు దక్కాయని వివరించారు. కేటీఆర్ ఆరోపించినట్లు సోదా కంపెనీ ఎండీ సృజన్‌రెడ్డి సీఎం సొంత బావమరిది కాదని తెలిపారు. గతంలో అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి బీఆర్ఎసలోకి మారినందుకు అల్లుడు సృజన్‌రెడ్డికి పాలమూరు–రంగారెడ్డి పనుల్లో రూ.2,300 కోట్ల విలువ జేసే 7వ ప్యాకేజీ పనులు బహుమతిగా ఇచ్చారని ఆరోపించారు. నిజానికి సృజన్‌రెడ్డి కేటీఆర్‌కే దగ్గరి మనిషి అన్నారు. సృజన్‌రెడ్డి మామ కందాళ ఉపేందర్‌రెడ్డి ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో పాలేరు నుంచి తన మీద పోటీ చేసి ఓడిపోయారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో 3.99 శాతం అదనపు అంచనాలతో టెండర్లు పిలిస్తే తమ ప్రభుత్వం దాన్ని 2.44 శాతానికి తగ్గించి టెండర్లు ఖరారు చేసిందన్నారు. గత పాలకులు చేసిన దానికంటే రూ.57 కోట్లు తక్కువకే టెండర్లు ఇచ్చామన్నారు. వారికి టెండర్లు ఇచ్చేందుకు సీఎం ఎవరిని టెండర్లు వేయవద్దని కానీ, ఎవరిని బెదిరించింది కానీ లేదన్నారు. నిబంధనల మేరకే పనులు అప్పగించామన్నారు.

# రూ.8,888 కోట్ల 'అమృత్' పనుల్లో అవినీతి

మొదటి పేజీ తరువాయి

మంజూరు చేసిన రూ.8,888 కోట్ల పనుల్లో చోటుచేసుకున్న అవినీతే దీనికి నిదర్శనంగా పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి బావమరిది సూదిని సృజన్‌రెడ్డికి చెందిన శోధ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి అర్హత, నైపుణ్యం, అనుభవం, ఆర్థిక వనరులు లేకున్నా టెండర్లు కట్టబెట్టారన్నారు. ఈ అంశంపై సీఎం స్పందించాలని, అమృత్‌లో అవినీతి చోటుచేసుకుంటున్నా, బీజేపీ నాయకులు స్పందించని పక్షంలో కుమ్మక్కు అయినట్టు భావించాల్సి ఉంటుందన్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, గోపీనాథ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్‌తో కలిసి తెలంగాణభవన్‌లో శనివారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే...

**మూడు నెలల్లోనే భారీ అవినీతి**

'అధికారంలోకి వచ్చిన మూడునెలల్లోనే రూ.8,888 కోట్ల భారీ అవినీతికి రేవంత్ తెర లేపారు. సీఎం పదవితోపాటు పురపాలకశాఖ బాధ్యతలు చూస్తు న్న రేవంత్ తన పదవిని దుర్వినియోగం చేశారు. ఇది అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 7, 11, 13 కింద సీఎంను ప్రాసిక్యూట్ చేయొచ్చు. గతంలో పదవీ దుర్వినియోగం ఆరోపణలపై ఎంపీగా సోనియాగాంధీ, కర్ణాటకలో యెడియూరప్ప, మహా రాష్ట్రలో అశోక్‌చవాన్ ముఖ్యమంత్రి పదవులకు రాజీనామా చేశారు. ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీని బెదిరించి రూ.2 కోట్ల లాభంలో ఉన్న రేవంత్ బావమరిది కంపెనీకి జాయింట్ వెంచర్ పేరిట టెండర్లు కట్టబెట్టారు. రూ.1,137 కోట్ల కాంట్రాక్టు పనుల్లో ఇండియన్ హ్యూమ్ పైప్ కంపెనీ వాటా కేవలం 20 శాతం మాత్రమే. శిఖండి సంస్థను అడ్డుపెట్టుకొని సీఎం బావమరిది సృజన్‌రెడ్డి ప్రజాధనం కొల్లగొడుతున్నారు. సీఎం స్వయంగా అధికారులపై ఒత్తిడి తెచ్చి కాంట్రాక్టులు కట్టబెట్టారు.

**టెండర్లపై పూర్తిగా గోప్యత**

ఇండియన్ హ్యూమన్ పైప్ కంపెనీకి టెండర్లు దక్కిన అంశానికి సంబంధించిన జీవోలను వెబ్‌సైట్‌లో పెట్టలేదు. ఈ టెండర్లలో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశించాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు లేఖ రాశాం. కేంద్ర నిధులు పక్కదారి పడుతున్నా బీజేపీకి చెందిన ఇద్దరు కేంద్ర మం త్రులు, ఎంపీలు ఎందుకు మాట్లాడటం లేదు. అమృత్‌లో అవినీతిపై విచారణకు ఆదేశించని పక్షంలో ఈ అవినీతిలో బీజేపీ నేతలు సంబంధం ఉందని భావించాల్సి వస్తుంది. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే రాజాసింగ్ తదితరు లు సీఎం రేవంత్ సుద్దపూస అని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్ తన కుటుంబ సభ్యులతో కలిసి చేస్తున్న అవి నీతిని ధారావా హికంగా బయట పెడతామని' కేటీఆర్ అన్నారు.

# బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్

మొదటి పేజీ తరువాయి

సమావేశం జరిగింది. ఈ సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.. కాంగ్రెస్ నుంచి మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, ఎంఐఎం నుంచి బలాల, బీజేపీ నుంచి రామారావు పవార్, బీఆర్ఎస్ నుంచి పల్రాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, భాను ప్రసాద్ రావు, సత్యవతి రాథోడ్, ఎల్ రమణ హాజరయ్యారు. ఈ సమావేశం సందర్భంగా పీఏసీ చైర్మన్‌గా అరికెపూడి గాంధీని ఎలా నియమిస్తారని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబును బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్ అన్నారు. అలాగే, పీఏసీకి ఎన్ని నామినేషన్లను వచ్చాయని ప్రశ్నించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. అనంతరం, సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడుతూ..'మా ప్రశ్నలకు పీఏసీలో ఎటువంటి సమాధానం చెప్పడం లేదు.. అందుకే వాకౌట్ చేశాం. స్పీకర్ స్పందించడం లేదు.. అన్ని శ్రీధర్ బాబే మాట్లాడుతున్నాడు. వాళ్ల తప్పుడు పనులు మేము బయటపెడతామని భయపడుతున్నారు. అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌లోనే ఉంటే మా ఎల్పీ ఆఫీసుకు ఎందుకు రావడం లేదు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వ్యక్తికి పీఏసీ చైర్మన్ ఇచ్చారు. గాంధీకి మా పార్టీ నుంచి నామినేషన్ ఇవ్వలేదు. హరీష్ రావు వేసిన నామినేషన్ ఏమైంది. గాంధీ నామినేషన్ ఎలా వచ్చింది. ఆయన ఎంపిక ఎలక్షన్ ప్రకారం జరిగిందా.. సెలక్షన్ ప్రకారం జరిగిందా అనేది మాకు తెలియాలి. పీఏసీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైనది. ప్రతీ రూపాయిని ప్రజల పక్షాన పీఏసీ ఆడిట్ చేస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. మా సభ్యుల సంఖ్య ప్రకారం ఐదుగురి పేర్లు ఇవ్వమన్నారు. ఐదుగురి పేర్లు ఇచ్చాం. కానీ, అందులో గాంధీ పేరు లేదు. అయినప్పటికీ గాంధీకి ఎలా పదవి ఇచ్చారు. 2014లో కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్‌లో ప్రతిపక్ష హోదా లేదు.. అయినా ప్రతిపక్ష హోదా ఇచ్చారు. పార్లమెంట్ పీఏసీ చైర్మన్‌గా కేసీ వేణుగోపాల్‌ను చేశారు. రాహుల్ గాంధీ సూచన మేరకే ఇది జరిగింది. 2014లో తెలంగాణలో కూడా కాంగ్రెస్‌కే పీఏసీ పదవి ఇచ్చాం. 2018లో కాంగ్రెస్ కంటే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఎంఐఎంకు ఉన్నారు. 2018లో సింగిల్ లార్జెస్ట్ పార్టీ ఎంఐఎం కాబట్టి అక్బరుద్దీన్‌కు పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చాం. 2018లో పీఏసీ చైర్మన్ శ్రీధర్ బాబు అడిగారనేది అవాస్తవం' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ..'నామినేషన్ వేయకుండానే గాంధీకి పీఏసీ చైర్మన్ పదవి ఇచ్చారనేది మా వాదన. ఎజెండా ఏంటో ఇంకా చూడలేదు.. ఆలోపే వాకౌట్ చేశాం. హైకోర్టు తీర్పునకు అనుగుణంగా అసెంబ్లీ సెక్రటరీ నిర్ణయం తీసుకోవాలి. మొదట పార్టీ మారిన ముగ్గురిపై కేసు వేశాం. మిగతా వారిని ఇంప్లీడ్ చేస్తాం. స్పీకర్ తీర్పును న్యాయ సమీక్ష చేస్తామని హైకోర్టు చెప్పింది' అంటూ కామెంట్స్ చేశారు.

# కాంగ్రెస్ నేతలు అర్బన్ నక్సలా?

మొదటి పేజీ తరువాయి

చేసిన చరిత్ర ఉందని శనివారం పేర్కొన్నారు. దేశ సమగ్రత, సమైక్యత, ప్రజాస్వామిక విలువల పరిరక్షణకు కట్టుబడి ఉన్న కాంగ్రెసపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. కాగా మైనింగ్, గ్రీన్ పవర్ రంగాల్లో పెట్టుబడులను ఆహ్వానించడమే లక్ష్యం గా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శనివారం అమెరికా, జపాన్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. 22 నుంచి అక్టోబరు 4 వరకు ఈ పర్యటన కొనసాగుతుంది.

# సంచలనంగా మార్చొద్దు

మొదటి పేజీ తరువాయి

నిత్యం వేంకటేశ్వర స్వామిని దర్శించుకునే లక్షలాది మంది భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టేందుకు.. వారి మనోభావాలను పరిరక్షించేందుకు కృషి చేయాలని కిషన్ రెడ్డి కోరారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందన్న వార్తలు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించాయని పేర్కొ న్నారు. హిందువులు ముఖ్యంగా శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీయడం క్షమార్హం కాదన్నారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన నేరస్తులకు తగిన శిక్ష పడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దిశగా పోలీసు యం త్రాంగం, దర్యాప్తు సంస్థలు ముందుకు వెళ్తున్నాయని ఆశిస్తు న్నామని పేర్కొన్నారు. ఇలాంటి దురాగతానికి బాధ్యులైన వారందరినీ గుర్తించి తగిన శిక్ష పడేలా చేయాలని కోరారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఘటనలేవీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని కిషన్‌రెడ్డి సూచించారు.

# అధికారులు మాట వినడం లేదట!.. టీపీసీసీ చీఫ్‌కు కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి

ఎన్నికలు, పార్టీకి ప్రభుత్వానికి మధ్య సమన్వయం తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. మరోవైపు, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల తర్వాత కాంగ్రెస్ పార్టీ సమీక్షలు చేపడుతోంది. పీసీసీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో శనివారం నుంచి జిల్లా స్థాయి సమీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాల వారీగా పార్టీ పరిస్థితి, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల స్థితిగతులు, క్షేత్రస్థాయిలో ప్రజాభిప్రాయం, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాల్సిన తీరు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ అంశాల ప్రాతిపదికగా ఈ సమీక్షలు జరుగుతాయని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశాల్లో పార్టీ అన్ని స్థాయిల నాయకులు పాల్గొననున్నారు.

# కాళేశ్వరం నీళ్లా? ఎల్లంపల్లి వాటరా?

మొదటి పేజీ తరువాయి

రెడ్డి అంటే.. హెలికాప్టర్ పేల్చేస్తానని చెప్పాను. ఇంజనీర్ కాని ఇంజనీర్ కేసీఆర్ నిర్వాకం వల్లే కాళేశ్వరం ప్రాజెక్ట్ పనిరాకుండా పోయింది. కేసీఆర్ హయాంలోనే కాళేశ్వరం ప్రాజెక్ట్ ధ్వంసానికి కుట్ర జరిగిందని ఆనాటి అధికారులు చెప్పారు. కేసీఆర్ పాలనలోనే కాళేశ్వరం కుంగిపోయి నిష్ప్రయోజనంగా మారింది' అంటూ కామెంట్స్ చేశారు.

# 28న హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

**హైదరాబాద్:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 28న రాష్ట్రానికి రానున్నారు. ఒక రోజు పర్యటనలో భాగంగా ఆమె ఆ రోజు ఉదయం హైదరాబాద్ శివారు శామీర్‌పేటలోని నల్సార్ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవానికి హాజరవుతారు. సాయంత్రం రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్‌ను ప్రారంభిస్తారు. రాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకొని సీఎస్ శాంతికుమారి శనివారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. శాఖల మధ్య సంపూర్ణ సహకారం ఉండేలా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆమె ఆదేశించారు.

# మహిళా కమిషన్ సభ్యురాలిగా రేవంత్ రెడ్డి ప్రకటించబడిన చాకలి ఐలమ్మ మునిమనుమరాలు శ్వేత, కుటుంబ సభ్యులు

వాయిస్ టుడే న్యూస్ (పటాన్‌చెరు): ప్రజా ప్రభుత్వంలో భాగస్వాములుగా మహనీయుల వారసులను చేసిన ఘనత రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు..

**మహనీయులను,ఉద్యమకారులను గౌరవించుకునే ఏకైక పార్టీ కాంగ్రెస్: నీలం మధు ముదిరాజ్**

మూడు సంవత్సరాల క్రితం నీలం మధు ఆధ్వర్యంలో చిట్కుల్ లో ఐలమ్మ మునిమనుమారాలు చేతుల మీదుగా ప్రారంభింపబడిన రాష్ట్రంలోనే ఎత్తైన ఐలమ్మ కాంస్య విగ్రహనికి పూలమాల వేసి అక్కడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన నీలం మధు మరియు శ్వేత.. శ్వేతను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన నీలం మధు ముదిరాజ్..

**తనను మహిళా కమిషన్ సభ్యురాలిగా ప్రకటించినందుకు సిఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు: శ్వేత**



తెలంగాణ ఉక్కు మహిళ చాకలి ఐలమ్మ మునిమనమరాలు మహిళా కమిషన్ సభ్యురాలుగా ప్రకటించబడిన శ్వేత మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ కాంగ్రెస్ పార్టీ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజును చిట్కుల్ లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మూడు సంవత్సరాల క్రితం చిట్కుల్ గ్రామంలో రాష్ట్రంలోనె అతిపెద్ద చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్టించి చాకలి ఐలమ్మ వారసత్వాన్ని భావితరాలకు తెలిసేలా చేసిన నాయకుడు నీలం మధు అని ఆమె స్పష్టం చేశారు. ఆ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తాను ముఖ్యఅతిథిగా హాజరై వేలాది జనం సమక్షంలో విగ్రహాన్ని తన కూతురి చేతుల మీదుగా ప్రారంభించడం తన జీవితంలో మర్చిపోలేని ఘటనని తెలిపారు. మొదటగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తనను ముఖ్య అతిథిగా ఆహ్వానించి చాకలి ఐలమ్మ కుటుంబ వారసురాలిగా తనకు గుర్తింపుని ఇచ్చారని కొనియాడారు.

అనంతరం నీలం మధు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో కోటి మహిళా యూనివర్సిటీ కి చాకలి ఐలమ్మ పేరు పెట్టడంతోపాటు ఆమె మునిమనుమరాలు శ్వేతకి మహిళా కమిషన్ సభ్యురాలుగా అవకాశం ఇవ్వడం పట్ల నీలం మధు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో మహనీయుల కుటుంబీకులను భాగస్వామ్యం చేయడం మంచి పరిణామం అన్నారు, తెలంగాణ ఉద్యమకారులకు మహనీయుల కుటుంబాలను గుర్తిస్తూ పదవుల్లో పెద్దపీట వేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీయే అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుంకరి రవీందర్, చాకలి వెంకటేశ్, మాజీ ఉపసర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి,వి నారాయణరెడ్డి, వెంకటేశ్, మురళీ, ఆంజనేయులు, చాకలి సత్యా నారాయణ, చాకలి కృష్ణ, చాకలి నర్సింలు, చాకలి సురేష్, రజక సంఘం సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



## కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ప్రకటించాలి

అంబర్‌పేట, సెప్టెంబర్ 21బీ(వాయిస్ టూ డే) నాటి నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదిరించి పోరాడటమే కాకుండా ఏడవ నిజాంపైన బాంబు దాడి చేసి పోరాట ఉధృత స్వభావాన్ని వ్యక్తపరచిన తెలంగాణ ధీశాలి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని అంబర్పేట నియోజకవర్గం పద్మశాలి సంఘం నాయకులు కోరారు. నియోజకవర్గం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతిని శివం రోడ్డులోని న్యూఆజాం కాంప్లెక్స్లో గల సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సంఘం గౌరవ అధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, అధ్యక్షుడు వర్కాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి చిలక శివ్కుమార్, కోశాధికారి భీమనపల్లి అశోక్ లు మాట్లాడుతూ మూడు తరాలను ముద్దాడిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన మంత్రి పదవికి రాజీనామా చేసి మళ్లీ ఎన్నో అవకాశాలు వచ్చిన పదవులను చేపట్టకుండా పోరాడిన ఏకైక వ్యక్తి బాపూజీ అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం చల్లని చలిలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 95 ఏళ్ల వయసులో దీక్షకు బూనిన వ్యక్తి అని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ఎలగందుల అంజయ్య, గంగిశెట్టి సత్తయ్య, సలహాదారుడు నక్క రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీస్ పెద్దబొమ్మ మధుసూధన్, తీగల నరేందర్, బాగ్ అంబర్పేట డివిజన్ అధ్యక్షుడు కడిగె శ్రీనివాస్, ఇడెం యాదగిరి, మహిళా నాయకురాలు భోగ నీరజ తదితరులు పాల్గొన్నారు.

## ఓయూలో ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

సికింద్రాబాద్, సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి): తెలంగాణ తొలి దశ ఉద్యమం 1969 లోనే తెలంగాణ కాంక్షతో మంత్రి పదవిని త్యాగం చేసిన గొప్ప త్యాగశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఓయూ జెఏసి చైర్మన్ బాలకృష్ణ నేత అన్నారు. ఈ మేరకు కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి కార్యక్రమాన్ని ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో బాలకృష్ణ నేత పాల్గొని బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు తరాల ఉద్యమ నాయకుడు, స్వాతంత్ర సమరయోధుడు, బడుగు బలహీన వర్గాలకు స్ఫూర్తి ప్రదాత కొండ లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో బాపూజీ కలలు కన్న సామాజిక న్యాయం లేకుండా పోయిందన్నారు. ఆయన వేసిన ఉద్యమ బాటలో ముమ్ముందు తరాలు పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సలీం పాషా, విజేఎస్ అధ్యక్షుడు మాసంపల్లి అరుణ్, వలిగొండ శ్రీనివాస్, ఈరెంటి విజయ్, బోనాల నగేష్, శేఖర్, రాపోలు వాసు, వర్కాల రవి, శ్రీనివాస్, క్రాంతి, వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## తిరుమల లడ్డు ప్రసాదంపై జరిగిన అవమానకర ఘటన

### బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



జూబ్లీహిల్స్ సెప్టెంబర్ 21( వాయిస్ టుడే): బోరబండ డివిజన్ బిజెపి అధ్యక్షులు కొత్త వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం రోజు బోరబండ పోలీస్ స్టేషన్‌లో తిరుమల లడ్డు ప్రసాదంపై చోటుచేసుకున్న ఆందోళనకర పరిణామాలపై అధికారిక ఫిర్యాదు చేయబడింది. బోరబండ హౌస్ ఆఫీసర్ వీర శేఖర్ గారికి లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించడం జరిగింది.

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రసాదమైన లడ్డు, సుదీర్ఘకాలంగా హిందూ మత విశ్వాసానికి ప్రతీకగా, అత్యంత పవిత్రమైనదిగా పరిగణించబడుతుంది. ఈ లడ్డు ప్రసాదంలో "లార్డ్," "బీఫ్ టాలో," మరియు "ఫిష్ ఆయిల్" వంటి అపవిత్ర పదార్థాలు ఉన్నాయన్న ఆరోపణలు వెలుగులోకి రావడం హిందూ సమాజంలో తీవ్ర ఆగ్రహానికి దారితీసింది. హిందూ ధర్మాన్ని కించపరచే ఈ వ్యవహారం తీవ్రంగా పరిగణించబడింది. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి మన కలియుగ దైవంగా పూజించబడుతుండగా, ఇలాంటి ఆరోపణలు మన సాంప్రదాయాలను తీవ్రంగా దెబ్బతీసే ప్రయత్నం అనిపిస్తున్నాయి.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ప్రముఖులు:కాట్రాజ్ రాజ్ కుమార్ – బిజెపి సీనియర్ నాయకులు గూడూరు శ్రీధర్ రెడ్డి – మాజీ ఎర్రగడ్డ డివిజన్ బిజెపి అధ్యక్షులు, లక్క మహేష్ – ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి, చంద్రశేఖర్ – సీనియర్ బిజెపి నాయకులు, సునీల్ – బోరబండ డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు, సూర్య కుమార్ – బోరబండ డివిజన్ బిజెపి వైస్ ప్రెసిడెంట్, రాజు – సీనియర్ బిజెపి నాయకులు బాబు – సామాజిక కార్యకర్త .రాకేష్ – యువ మోర్చా హైదరాబాద్ సిటీ కార్యవర్గ సభ్యులు.సాయి – బోరబండ డివిజన్ ఎస్సీ మోర్చా కార్యదర్శి నవీన్ – బోరబండ డివిజన్ ఓబీసీ మోర్చా కార్యదర్శి బాధ్యులైన తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ వై.వి. సుభా రెడ్డి, మాజీ సీఈఓ ధర్మా రెడ్డి, మరియు ప్రసాదానికి గంధం, నెయ్యి సరఫరా చేసిన ఏ.ఆర్. డైరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ సహా సంబంధిత సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకత్వం డిమాండ్ చేసింది. అలాగే, ఈ వ్యవహారంలో ముఖ్యంగా మాజీ దేవాదాయ శాఖా మంత్రి కూడా బాధ్యత వహించాలంటూ పిలుపునిచ్చారు. హిందూ సంప్రదాయాల పరిరక్షణకు ఈ కార్యక్రమం ప్రతినిధులందరి ద్వారా గొప్పగా నిర్వహించబడింది.



## గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా భాస్కరచారి

### శుభాకాంక్షలు తెలిపిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే

అబ్దుల్లాపూర్ మెట్టు: సెప్టెంబర్21(వాయిస్ టుడే) నూతనంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా భాస్కరచారి నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం పలు శాఖలలో చైర్మన్ లను ఎన్నుకోవడం జరిగింది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే సహకారంతో గడిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా భాస్కరచారిని నియమించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, తమ విధులను సక్రమంగా నిర్వర్తించి, రైతులకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి సహకరించాలని, వ్యవసాయ మార్కెట్ ను అభివృద్ధి పథంలో తీసుకురావాలని ఆయన తెలిపారు. భాస్కరచారి మాట్లాడుతూ తమను గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా నియమించినందుకు పెద్దలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తారని, రైతుల పట్ల స్నేహభావంతో ఉంటూ వారికి ఎల్లప్పుడూ సాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, మల్ రెడ్డి యాదగిరి రెడ్డి, యువ నాయకులు మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## స్వాతంత్ర సమరయోధుడు, తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు: పటాన్చెరు నియోజకవర్గం పటాన్చెరు డివిజన్ పరిధిలోని బస్టాండ్ ప్రాంగణంలో గల ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించిన పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. తెలంగాణ ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. హాజరైన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వంగరి అశోక్, కంకర సీనయ్య, తదితరులు.



## ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తా

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

ఉప్పల్ ( వాయిస్ టుడే ప్రతినిధి):– ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.రామంతా పూర్ శ్రీనివాస పురం లో 77 లక్షలతో సిసి రోడ్డు ఎస్ డబ్ల్యు డి పనులకు స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు తో కలిసి శంకుస్థాపన చేశారు. ఉప్పల్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో వుంటానని తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సూరం శంకర్ ,పవన్, చంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఎదగాలి

**ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రో. బి. లింబాద్రి**

**వివేకానంద డిగ్రీ కళాశాలలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్**

సికింద్రాబాద్, సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఎదగాలనీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రో. బి. లింబాద్రి చెప్పారు. శనివారం రోజు విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రో. బి. లింబాద్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థలో విద్యార్థులతో సంబంధాన్ని స్నేహ బంధంగా వివరిస్తూ విద్యార్థుల ఆడ్మీషన్ ప్రకియ (దోస్త్) ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు విశేష ప్రయోజనాలను గుర్తుచేస్తూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఎదగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సి.సి.ఈ జాయింట్ డైరెక్టర్స్ ప్రో. డి. ఎస్. ఆర్. రాజేందంర్ సింగ్, ప్రో. జి. యాదగిరి, ఏ.జి.ఓ. డా. పి. బాలబాస్కర్ , ప్రిన్సిపల్ డా. కె. ప్రభు, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వెంకటేష్, ప్రొఫెసర్ లావణ్య సంస్కృత విభాగ అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ముక్తావాణి, ప్రొఫెసర్స్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# భారత సమ్మిళితాభివృద్ధికి మనవంతు చేయూతనిద్దాం

**కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ వార్షిక కోలాక్వీలో అభిప్రాయపడ్డ వక్తలు**

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు: భారతదేశం కోసం సమగ్ర విధానాలను రూపొందించి, దేశ సమ్మిళితాభివృద్ధికి మనవంతు చేయూతనిద్దా మని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ద్వైవార్షిక కొలాక్వీలో భాగంగా శనివారం 'భారతదేశం కోసం సమగ్ర విధానాలు' అనే అంశంపై ముఖాముఖి చర్చలను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో విభిన్న రంగాలకు చెందిన ప్రభుత్వ, ప్రభుత్వేతర నిపుణులు, ఉన్నతాధికారులు పాల్గొని. ఆయా అంశాలపై తనదైన శైలిలో పరిష్కార మార్గాలు చూపడంతో పాటు పలు సూచనలు చేశారు.

తొలుత, ఈ కార్యక్రమాన్ని పబ్లిక్ పాలసీలో మహిళలు, ఆర్థిక రంగ భవిష్యత్తు, డిజిటల్ పాలన, వాతావరణ మార్పులు, పర్యావరణ–సామాజిక పాలన అనే అంశాలు కౌటిల్యా పబ్లిక్ పాలసీ విద్యార్థులు పత్ర సమర్పణ చేశారు.




ఆ తరువాత ఆయా ప్రత్యేక అంశాలపై విడివిడి ముఖాముఖి చర్చలు (ప్యానెల్ డిస్కషన్స్) నిర్వహించారు. ఆర్థిక రంగ భవిష్యత్తుపై నిర్వహించిన చర్చలో డాక్టర్ రతిన్ రాయ్, చేజ్ ఇండియా ఉపాధ్యక్షుడు కౌశల్ మహన్, ఐఆర్సీఎస్ పూర్వ అధికారి పర్మిలా చావలీ పాల్గొన్నారు. పబ్లిక్ పాలసీలో మహిళలు అనే అంశంపై వీ వాబ్ అసోసియేట్ డైరెక్టర్ శాంతలా వీగాస్, తెలంగాణ ప్రభుత్వ పూర్వ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంత, హెర్టీ స్కూల్ ప్రొఫెసర్ డాక్టర్ ముజుహీద్ షేక్ పాల్గొన్నారు.

డిజిటల్ గవర్నెన్స్ చర్చలో రేజర్ పే ఇండియా డైరెక్టర్ శరణ్య గోపీనాథ్, డెలాయిట్ సీఐవో సుదీర్ఘ నీరసినేని, నాస్కామ్ ఫౌండేషన్ డైరెక్టర్ విక్రమ్ పాటిల్, తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్–ఐఏఎస్ పాల్గొన్నారు. వాతావరణ మార్పులపై జరిగిన చర్చలో అశోక్ లేలాండ్ కార్పొరేట్ స్ట్రాటజీ హెడ్ అలోక్ వర్మ, సంబోధి డిప్యూటీ ఉపాధ్యక్షుడు అభిషేక్ శర్మ, గ్రాంట్ థార్న్ టన్ భారత్ ఎల్ఎల్ పీ డైరెక్టర్ మోహన్ కుమార్ పాల్గొన్నారు.అప్పటికే ఆయా అంశాలపై పత్ర సమర్పణ చేసిన విద్యార్థులు నిపుణుల అభిప్రాయాలను ఆసాంతం ఆలకించడంతో పాటు సలు సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.కౌటిల్యా స్కూల్ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్, పలువురు ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ఈ ఒకరోజు ప్రత్యేక చర్చాగోష్ఠిని విజయవంతం చేశారు.



## జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

### డాక్టర్ పిడమర్తి రవి

శంషాబాద్ సెప్టెంబర్ 21( వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ జిల్లాల వారి చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మాదిగల మేలుకొలుపు యాత్రలో భాగంగా మూడవరోజు ఆదివారం శంషాబాద్ చేరుకున్న యాత్ర పట్టణంలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అనంతరం మాదిగ జేఏసీ రంగారెడ్డి జిల్లా నాయకులు గుంటి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బహిరంగ సభలో పిడమర్తి రవి మాట్లాడుతూ " తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఉమ్మడి 10 జిల్లాలలో మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం వారి జనాభా ఎంత ఉంటే అంత రిజర్వేషన్ కల్పించాలని కొన్ని జిల్లాలలో మాదిగలు అధికంగా ఉన్నారని ఆయన అన్నారు. మహబూబ్నగర్ ఉమ్మడి జిల్లాల్లో మాదిగలకు 14% రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేయడం హర్షనీయం అని ఈ కమిటీ మాదిగ జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ వర్గీకరణ కమిటీ విజ్ఞప్తి చేశారు. ఆదివారం మాదిగల మేలుకొలుపు యాత్రలో భాగంగా గద్వాల్ జిల్లాలలో యాత్ర ఉంటుందని అన్నారు. 30 సంవత్సరాల క్రితం పెట్టిన ఈ ఏడు శాతం డిమాండు ఇప్పుడు అమలు చేస్తే మాదిగలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పెరిగిన జనాభాకు అనుగుణంగా వర్గీకరణ చేయాలని జిల్లాలవారీగా వర్గీకరణ చేపట్టే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు అన్ని జిల్లాల కేంద్రంలో మాదిగల మేలుకొలుపు యాత్ర ఉంటుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పెద్ద కులాలకు రాష్ట్ర ప్రభుత్వంలో ప్రాతినిథ్యం తక్కువగా ఉందని మాదిగలు, లంబాడీలు, మాలలకు, ముదిరాజులకు మంత్రి పదవి ఇవ్వాలని అన్నారు. మాదిగ ఐక్య కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగల మేలుకొలుపు యాత్రలో భాగంగా ఆదివారం రాత్రి జిల్లా చేరుకుంటుందని ఈనెల 30న బోనగిరిలో ముగింపు సభ ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో, జీపి పాల్సన్,యండి మహ్మద్ నజీరుద్దీన్,మత్క రామేష్,శ్రీనివాస్,మధు,ప్రశాంత్,దేవదాస్, దళిత దండు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రమళ్ళ మొగులయ్య,మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొల్లికొండ వీరేందర్ ఎంహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మైస ఉపేందర్ మాదిగ, బిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, దేవరకొండ నరేష్,మాదిగ జేఏసీ ఓయూ అధ్యక్షులు జోగు గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## కొండ లక్ష్మణ్ బాపూజీ కి భారతరత్న ఇవ్వాలి

### కుందారం గణేష్ చారి



సికింద్రాబాద్, సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి): తొలి మలితరం తెలంగాణ ఉద్యమంలో ముందుండి నడిచిన గొప్ప వ్యక్తి కొండ లక్ష్మణ్ బాపూజీ అని బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి పేర్కొన్నారు. స్వాతంత్ర పోరాటం, రాజకీయం, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, సేవా కార్యక్రమాలు చేసిన కొండ లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మలిదశ ఉద్యమం పురుడు పోసుకుంది జలదృశ్యం లేనని గుర్తు చేశారు.బీసీ సమస్యలతో పాటు అన్ని వర్గాల ప్రజల కోసం పోరాటం చేసిన మాహానీయుడు కొండ లక్ష్మణ్ బాపూజీ అందరికీ గురువు అని అన్నారు. ఒక సంఘసంస్కర్త బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బీసీల కోసం నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు. ట్యాంక్ బండ్ జలదృశ్యం కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద శనివారం 12వ వర్ధంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కుందరాం గణేష్ చారి హాజరై బిసి రాజ్యాధికార సమితి దాసు సురేష్ తో కలిసి కొండ లక్ష్మణ్ బాపూజీకి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. బాపూజీ స్ఫూర్తిని తీసుకొని ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలందరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. నివాళులర్పించిన వారిలో మేడం శంకరాచారి, భానూరి కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.



## బాలాజీనగర్ విగ్నేశ్వరుడికి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 21(వాయిస్ టుడే) కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని బాలాజీనగర్ లో నెలకొల్పిన గణనాథుని కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మరియు మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ చౌదరి, సుభాష్ గౌడ్, భాస్కర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలి: టీజేఎస్ఎస్

**సమాచార హక్కు చట్టాని సక్రమంగా అమలు చేయాలి**

**అర్హులైన జర్నలిస్టులకే అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలి**

**ప్రభుత్వం జర్నలిస్టులకు జారీ చేసిన స్థలాలో జరిగిన పొరపాట్లు సరిదిద్దాలి**

**టీజేఎస్ఎస్ ఆధ్వర్యంలో హౌసింగ్ సొసైటి ఏర్పాటు**

**టీజేఎస్ఎస్ సభ్యులందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు**

**టీజేఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం**



సికింద్రాబాద్, సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి): జర్నలిస్ట్ లకు రక్షణ కల్పించడంతో పాటుగా, జర్నలిస్ట్ ల రక్షణకు ప్రత్యేక రక్షణ చట్టం తేవాలని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం (TJSS) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు టీజేఎస్ఎస్ రాష్ట్ర కమిటీ సర్వసభ్య సమావేశం హైదరాబాద్ లోని టీజేఎస్ఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆనంచిన్ని వేంకటేశ్వర రావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జర్నలిస్టులపై అనేక దాడులు జరిగాయని, అక్రమంగా ఎన్నో కేసులు పెట్టారని ప్రస్తుత ప్రభుత్వంలో కూడా ఆ దాడులు ఆగడం లేదని అన్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి కొన్ని నెలలే అయ్యిందని కొంత సమయం ఇవ్వాలన్న ఆలోచనతో ఇన్ని రోజులు మాట్లాడలేదని, 9 నెలలు అయినా ఇంకా దాడులు ఆగడం లేదని అందుకే ఈ రోజు మాట్లాడుతున్నామని తెలిపారు. ఈ ప్రభుత్వంలో అయినా కనీసం జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని అందుకోసమే అవసరమైతే ప్రత్యేక చట్టం తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాచార హక్కు చట్టం-2005 కింద సమాచారం కోసం దరఖాస్తు చేసినప్పటికీ పౌర సమాచార అధికారులు సరిగ్గా స్పందించడం లేదని, కావాల్సిన సమాచారాన్ని ఇవ్వడం జాప్యం చేయడం, దాటవేయడం జరుగుతుందని, ఇది మంచిది కాదని ఇప్పటికైనా అధికారులు మేల్కొనక పోతే కోర్టులకు వెళ్లాల్సి వస్తుందన్ని హెచ్చరించారు.

ప్రధాన కార్యదర్శి గౌతీ రామకృష్ణ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమ కోసం టీజేఎస్ఎస్ నిరంతరంగా కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడైనా జర్నలిస్టులపై దాడులు జరిగినా, అక్రమ కేసులు బనాయించినా టీజే ఎస్-ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. అలాగే గత ప్రభుత్వంలో అక్రిడేషన్ కార్డులు దుర్వినియోగం అయ్యాయని, పాలు పోసేవాడికి, మెకానికులకు, సర్పంచులకు, ఆఖరికి పొట్ట కొస్తే అక్షరం ముక్క రానివారికి కూడా అక్రిడేషన్ కార్డులు జారీచేశారని తెలిపారు. కొన్ని సంస్థలు అక్రిడేషన్ కార్డులను 20 వేల నుండి 30 వేల వరకు తీసుకుంటూ అమ్ముకుంటునాయని అన్నారు. కొత్త ప్రభుత్వం అయినా అక్రిడేషన్ కార్డుల విషయంలో విడివిధానాలు రూపొందించి అర్హులైన జర్నలిస్టులకే అక్రిడేషన్ కార్డులు జారీ చేయాలని కోరారు. అలాగే జర్నలిస్టులకు మినిమం క్వాలిఫికేషన్స్ ప్రకారమే కార్డులు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఒక్క వార్తా రాయడం రాని వాళ్ళు కూడా రిపోర్టర్లమని తిరుగుతున్నారని అలాంటి వారి వళ్ళ జర్నలిస్టులు అంటేనే చులకన ఏర్పడిందని ఇప్పటికైనా అలాంటి వారిని కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. జర్నలిస్టులకు ఓఆర్ఆర్, జాతీయ, రాష్ట్ర రహదారులపై ఉన్న టోల్ లో ఉచిత ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు.

వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ యాలాల మాట్లాడుతూ టీజేఎస్ఎస్ లో సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరికీ హెల్త్ ఇన్సూరెన్స్ జారీ చేస్తామని దాని సంబంధించిన విధివిధానాలు త్వరలో విడుదల చేస్తామని తెలిపారు. అలాగే టీజేఎస్ఎస్ ఆధ్వర్యంలో 10 మంది అడ్వకేట్లతో ఒక లీగల్ సెల్ ఏర్పాటు చేస్తామని, ప్రతి జర్నలిస్టులకు న్యాయపరంగా అండగా ఉంటామని తెలిపారు. రాష్ట్రంలో ఏ జర్నలిస్టులపైన దాడులు జరిగిన, అక్రమ కేసులు బనాయించినా టీజేఎస్ఎస్ లీగల్ సెల్ నుండి వారికి అవసరమైన న్యాయ సహాయం అందజేస్తామని తెలిపారు. అలాగే మొన్న ప్రభుత్వం జర్నలిస్టులకు అందజేసిన ఇంటి స్థలాల విషయంలో కొంత గందరగోళం ఏర్పడిందని. అందులో ఆంధ్రకి సబంధించిన జర్నలిస్టులకు, అలాగే మినిస్టర్, ఎంఎల్ఏ అయిన వారికి అలాగే ఒకసారి ప్రభుత్వం నుండి ఇళ్ల స్థలాలు పొందిన వారికి కూడా స్థలాలు ఇచ్చారని ఇది అర్హులైన జర్నలిస్టులకు అన్యాయం చేసినట్టేనని, ప్రభుత్వం ఇప్పటికైనా తప్పును సరిదిద్దుకొని అర్హులైన జర్నలిస్టులకే స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు లేనిచో కోర్టుకు వెళ్ళి అయినా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

టీజేఎస్ఎస్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హౌసింగ్ సొసైటిని ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ప్రతి ఒక్క వర్కింగ్ జర్నలిస్టులకు ఆయా నియోజకవర్గాలలోనే స్థలాలు కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని టీజేఎస్ఎస్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. టీజేఎస్ఎస్ జిల్లా కమిటీలను తొందర్లోనే వేయాలని ఈ సందర్భంగా సభ్యులు కోరారు. అక్రిడేషన్ కార్డు జారీ ప్రక్రియలో టీజేఎస్ఎస్ ని కూడా ఆహ్వానించాలని మీడియా అకాడెమీ ఛైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని తీర్మానిచ్చారు. యూట్యూబ్ ఛానెల్స్, డిజిటల్ పేపర్లకు కూడా వారి వారి సీనియార్టీ బట్టి ఎంపానెలలో చోటు కల్పించాలని కోరారు.

ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఉన్న శ్రీధర్ యాలాలని వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నుకున్నారు. కొత్తగా వంగ సత్తిరెడ్డిని మరో వైస్ ప్రెసిడెంట్ గా, శ్రావణ్ ని జాయింట్ సెక్రెటరీగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో టీజేఎస్ఎస్ అధ్యక్షుడు ఆనంచిన్ని వేంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి గౌతీ రామకృష, వైస్ ప్రెసిడెంట్లు శ్రీధర్ యాలాల, సత్తిరెడ్డి, కోశాధికారి సతీష్, అధికార ప్రతినిది బాపట్ల కృష్ణ మోహన్, జాయింట్ సెక్రెటరీలు శంకర్ బాబు, శ్రవణ్, కీర్తి రాజు, కిరణ్, మదవేని శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు, జీహెచ్ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు రాయచూరు మాజీ ఎమ్మెల్యేకు సన్మానం

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర కర్ణాటకలోని రాయచూరు మాజీ ఎమ్మెల్యే,మున్నూరుకాపు సమాజం ప్రముఖులు పాపారెడ్డిని ఘనంగా సన్మానించారు. పాపారెడ్డి హైదరాబాద్ పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఎంపీ రవిచంద్ర ఆహ్వానం మేరకు శనివారం సాయంత్రం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఆయన నివాసాన్ని సందర్శించారు. మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డితో పాటు కలిసి వచ్చిన రాయచూరు మున్నూరుకాపు సమాజం ప్రముఖులు నర్సారెడ్డి, కృష్ణమూర్తి,శేఖర్ రెడ్డి, నర్సింహులు, ప్రతాపరెడ్డి, రాజేందర్ రెడ్డి, మల్లేష్, మహేందర్ రెడ్డి,మునిరెడ్డి,వినయ్ రెడ్డిలకు ఎంపీ వద్దిరాజు సాదర స్వాగతం చెప్పి శాలువాలతో సత్కరించారు, వారి గౌరవార్థం ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు ప్రముఖులు రౌతు కనకయ్య, డాక్టర్ పీఎల్ఎన్ పటేల్,ఊసా రఘు,మరికల్ పోత సుధీర్ కుమార్,భేతి శ్రీధర్,తెల్లా మురళీధర్,ఆకుల సదానంద్, జెన్నాయికోడే జగన్మోహన్ తదితరులు ఉన్నారు.



# మహిళలు మార్పుకు ప్రధాన పాత్రధారులుగా నిలవాలి: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సికింద్రాబాద్, సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి): మహిళలు మార్పు కోసం ఎదురు చూడకుండా, మార్పుకు ప్రధాన పాత్రధారులుగా నిలవాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. మహిళలకు సవాళ్లను ఎదుర్కొనే సత్తా ఉండాలని, అప్పుడే మహిళలు సాధికారత సాధించగలరని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ లోని ఠాగూర్ ఆడిటోరియంలో అఖిల భారత రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ ( ఐసిఎస్-ఎస్ఆర్) ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఉమెన్ అకాడేమిషన్స్ కాన్ఫరెన్స్ ను శనివారం ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించారు. 'ఎన్విజనింగ్ న్యూ భారత్' అనే థీమ్ ఆధారంగా నిర్వహించిన ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ తో పాటు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ చైర్పర్సన్ సుధామూర్తి, ఏబిఆర్ఎస్ఎం నేషనల్ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంత లక్ష్మణ్, జేఎన్ యు వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ శాంతశ్రీ పండిట్ , ఎన్ హెచ్ ఆర్ సి చైర్పర్సన్ విజయభారతి, దేవసేన ఐఏఎస్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిక విలువలకు అనుగుణంగా మహిళలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. విద్యకు లింగ బేధం లేదని, విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అన్నారు.




చిన్న విషయాలకు కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని సూచించారు. భారతీయ సంగీత సాంస్కృతిక విలువలు స్వదేశీ ఆలోచనలను ప్రతి వినిపిస్తాయని చెప్పారు. కొత్తదనాన్ని వెతకడం కంటే సంప్రదాయ ఆలోచనలను పునర్నిర్మించి, పునరుద్ధరించడం అవసరమని ఆయన పేర్కొన్నారు అనంతరం సుధా మూర్తి మాట్లాడుతూ పురాణాల్లో మహిళలు సమాజానికి విలువలను అందించడంలో కీలక పాత్ర పోషించారని విషయాన్ని గుర్తు చేశారు. మహిళలను విమర్శించకుండా ప్రశ్నించాలని, వారికి మార్గ నిర్దేశం చేయడం తప్ప నియంత్రించకూడదని సూచించారు. విద్య లింగబేదరహితమని, ఇతరులతో కాకుండా మనతో మనం పోటీ పడడమే మక్కువగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు తమ శక్తిని మార్పు తీసుకురావడానికి ఉపయోగించాలని సూచించారు. అనంతరం గుంత లక్ష్మణ్ మాట్లాడుతూ మహిళా విద్యావేత్తలు దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తారని కొనియాడారు. గని వీరి ప్రభావం తరగతి గదికి పరిమితం కాకుండా భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో , సమాజ అభివృద్ధికి సహకరించడంలో కూడా ఉందన్నారు. సదస్సుకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు 1200 మందికి పైగా మహిళా అధ్యాపకులు హాజరయ్యారని పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో మహిళల పాత్ర, వారి హక్కులు, వారికెదురైన సవాళ్లు వంటి అంశాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు వివరించారు. దాదాపు 200కు పైగా పరిశోధనా పత్రాలను సదస్సులో సమర్పించారని చెప్పారు.

# ప్రభుత్వ ఖాతాల సంఘం ప్రారంభ తొలి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సమావేశం

## పీఏసీ కమిటీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ అధ్యక్షతన వివిధ శత వసంతాల ప్రభుత్వ ఖాతాల సంఘం సమావేశం

శేరిలింగంపల్లిబీ సెప్టెంబర్ 21(వాయిస్ టుడే): ప్రభుత్వ ఖాతాల సంఘం తొలి సమావేశం శాసనమండలి కమిటీ సమావేశలో పీఏసీ కమిటీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కమిటీ సభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, రేవూరి ప్రకాష్ రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, యన్నం శ్రీనివాస రెడ్డి, రామారావు పవార్, అహ్మద్ బిన్ అబ్దుల్ బలాల, కూనంనేని సాంబశివరావు, టి జీవన్ రెడ్డి, టి భాను ప్రసాద్ రావు, యల్ రమణ, సత్యవతి రాథోడ్, అకౌంటెంట్ జనరల్ పి. మాధవి, శాసన మండలి కార్యదర్శి డా. వి. నరసింహాచార్యులు హాజరైనారు. ఈ మేరకు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ కు సభ్యులకు పుష్ప గుచ్ఛం ఇచ్చి అసెంబ్లీ స్పీకర్, కౌన్సిల్ ఛైర్మన శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి, లెజిస్లేటివ్ సెక్రటరీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియమించబడిన పీఏసీ ఛైర్మన్ మాట్లాడుతూ, శాసన పరిషత్ ఛైర్మన్ కు, శాసన సభ స్పీకర్ కు, శాసన వ్యవహారాల శాఖా మంత్రికి, కమిటీ సభ్యులకు, ఇతర ఉన్నతాధికారులకు స్వాగతం పలికారు. అదేవిధంగా ఛైర్మన్ ప్రసంగిస్తూ, శత వసంతాలు పూర్తి చేసుకున్న ఈ ప్రభుత్వ ఖాతాల సంఘానికి తనను ఛైర్మన్ గా నియమించడం గర్వంగా భావిస్తున్నాను. గతంలో ఎంతో మంది ప్రముఖులు, మేధావులు ఈ కమిటీకి ఛైర్మన్ గా సేవలు అందించారని తెలిపారు. పద్దుల కింద ప్రభుత్వ వ్యయం కొరకు మంజూరు చేసిన నిధులను సక్రమంగా వెచ్చించారా లేదా అధిక వ్యయం చేశారా, అధిక వ్యయం చేసినచో అందుకు దారితీసిన పరిస్థితులు మొదలగు విషయాలను కమిటీ పరిశీలించ వలసి ఉన్నదని తెలిపారు. ప్రజలు వివిధ రూపాలలో ప్రభుత్వానికి జమ చేసిన మొత్తంను రాష్ట్ర, అభివృద్ధికి, సంక్షేమానికి సక్రమంగా వెచ్చించారా లేదా అని అనునిత్యం ప్రభుత్వ ఖాతాలపై ఆడిట్ చేస్తూ, ప్రభుత్వ దుభారా కట్టడికి తీసుకోవలసిన పొదుపు చర్యలను తెలిపి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటును అందిచవలసి ఉన్నదని పేర్కొన్నారు.

కమిటీ ఛైర్మన్ సభ్యులనుద్దేశంచి ప్రసంగిస్తూ నేటి ఆధునిక ప్రభుత్వాలకు సంక్షేమం మరియు అభివృద్ధి రెండు కళ్లలాంటివి. పేద ప్రజల సంక్షేమం కొరకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అమలుచేస్తున్నది. వివిధ పథకాల అమలులో క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సవాళ్లను గుర్తించి సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయుటలో కమిటీ తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా తెలుపాలని పేర్కొన్నారు. వివిధ నివేదికలలో శాఖల వారీగా లేదా సంవత్సరాల వారీగా పేర్కొన్న ఆడిట్ పేరాలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలపై కమిటీ సమావేశంలో చర్చించి






కమిటీ సభ్యుల అభిప్రాయం ప్రకారంగా తదుపరి కార్యాచరణ రూపొందిచుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ప్రసంగిస్తూ, ప్రభుత్వం వివిధ సందర్భాలలో చేస్తున్న వ్యయం, సి, ఎజీ ఆడిట్ పేరాల రూపంలో వివిధ హెడ్ ల క్రింద తెలుపగా వాటిపై ప్రభుత్వం తీసుకున్న చర్యలపై నివేదికను కోరటం ద్వారా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కార్యనిర్వహణ శాఖ ఎల్లప్పుడూ శాసన శాఖకు బాధ్యత వహించాలి అనే సూత్రాన్ని నిజం చేస్తూ ఆయా చెకుల అకౌంట్స్ థియరీ వ్యవస్థల మధ్య నిరోద సమతుల్యాన్ని చక్కగా పాటించడం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ముఖ్య లక్షణమని తెలిపారు. శాసన పరిషత్తు ఛైర్మన్ మాట్లాడుతూ పీఏసీ కమిటీ ఛైర్మన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ అత్యంత ప్రాధాన్యత గల కమిటీ. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కమిటీ ఛైర్మన్ సభ్యులందరికి సముచిత ప్రాముఖ్యత ఉన్నదని మరియ నిధులను ఖర్చు చేయడంలో జరుగుతున్న జాప్యం, నిరుపయోగమైన ఖర్చులపై సంబంధిత శాఖాధికారులను ప్రశ్నించి, వివరణ కోరే అధికారం కమిటీకి ఉన్నదని తెలియజేస్తూ, కమిటీ సభ్యులందరు ప్రతి కమిటీ సమావేశానికి తప్పకుండా హాజరై తమ విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. అప్రాప్రియేషన్ ఆకౌంట్స్ మరియు ఆడిట్ రిపోర్టులను పరిశీలించే విషయంలో అకౌంటెంట్ జనరల్ కమిటీకి అవసరమైన గైడెన్స్ ఇస్తూ పూర్తి సహాయ, సహకారాలను

అందిస్తారని తెలియజేశారు. ఆయా, అంశాలపై క్షుణ్ణంగా చర్చించే నిమిత్తం అవసరమైన మేరకు సబ్ కమిటీలను కూడా ఏర్పాటు చేసుకునే అవకాశం కమిటీకి ఉందని తెలిపారు. సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ పీఏసీ కమిటీ ఛైర్మన్ గా ఎన్నికైన అరికేపూడి గాంధీకి, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్లు, అనుభవజ్ఞులు కమిటీలో ఉన్నరని పేర్కొంటూ, కమిటీల మాదిరిగా కాకుండా కమిటీ బాధ్యతలు భిన్నంగా ఉంటాయని, శాసనసభ ఆమోదం పొందిన కేటాయింపులలో ప్రతి శాఖ ఎంత ఖర్చు పెడుతుందనే విషయాన్ని కమిటీ పరిశీలిస్తుందని పేర్కొన్నారు. ఈ కమిటీ అన్ని ప్రభుత్వ శాఖలపై సమీక్షను నిర్వహించవచ్చును అని తెలిపారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా, నిధులను ఖర్చు చేయడంలో జరిగే అవకతవకలు మరియు లోపాలను ఎత్తిచూపుతూ, ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడాల్సిందిగా సభ్యులందరిని కోరారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మొదటగా కమిటీ ఛైర్మన్ మరియు సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినీ అసెంబ్లీ లాంటిదని, ఉభయ సభలు సంవత్సరమంతా సమావేశాలు నిర్వహించలేవని, కావున శాసనసభ కమిటీలు నిరంతరం క్రియాశీలకంగా ఉంటాయని, అందుకే ప్రజాస్వామ్యంలో కమిటీ వ్యవస్థను సూక్ష్మ శాసన వ్యవస్థగా అభివర్ణిస్తారని తెలిపారు. శాసనసభ నియమావళి ప్రకారమే ప్రతిపక్ష సభ్యుడిగా ఛైర్మన్ గా నియమించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం లోని అన్ని శాఖలకు కెటాయించిన బడ్జెట్ ను నియమాలకు అనుగుణంగా వ్యయం చేశారా లేదా అని కూడా తనిఖీ చేసి అధికారం ఈ ఒక్క కమిటీ మాత్రమే కలిగి ఉన్నదని పేర్కొన్నారు. ప్రభుత్వ లెక్కల కమిటీ భారతదేశంలో మొదటిసారిగా 1919లో మాంటేగ్ చేమ్స్ ఫర్డ్ సంస్కరణల సిఫారసుల మేరకు 1921లో ప్రారంభించడం జరిగినదని తెలిపారు. భారత రాజ్యాంగంలోని 151(2) అధికరణం క్రింద సభాసమక్షంలో ఉంచిన లెక్కలు లేదా విషయాలు లేదా ఖాతాలను నిర్దేశించిన విధంగా వ్యయం చేసారా లేదా అనే విషయాన్ని ఈ కమిటీ పరిశీలిస్తుందని తెలిపారు. ఈ సమవేశానికి హాజరైన సభ్యులు తమ అమూల్యమైన అనుభవాలను పంచుకుంటూ, కమిటీ తరచుగా సమావేశం నిర్వహించి ఆడిట్ పేరాలను క్షుణ్ణంగా పరిశీలించి తగు నివేదికలను సమర్పించేవిధంగా చూడాలని ఛైర్మన్ను కోరారు. ఈ కమిటీ పనితీరు ఇతర కమిటీల కన్నా మెరుగుగా ఉండాలని ఆశించారు. అకౌంటెంట్ జనరల్ పి. మాధని మాట్లాడుతూ, గత పది సంవత్సరాలకు సంబంధిచిన ఎన్నో ఆడిట్ పేరాలు ఇంకా అపరిష్కృతంగా ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా కమిటీ సమర్థవంతంగా పనిచేయుటకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. శాసన మండలి కార్యదర్శి డా. వి. నరసింహాచార్యులు మాట్లాడుతూ, ఈ ప్రారంభ సమావేశానికి విచ్చేసిన పెద్దలందరికీ, కమిటీ ఛైర్మన్ మరియు సభ్యులకు, అకౌంటెంట్ జనరలకు ఇతర ఉన్నతాధికారులకు పేరు పేరున ధన్యవాదాలు తెలియజేశారు.

# బీ ఆర్ ఎస్ రాజకీయ నాయకుల పేరుతో రౌడీయిజం

**అక్రమ నిర్మాణాలపై కథనాలు రాస్తే జర్నలిస్ట్లపై దాడులు**

**పోలీసులకు రాజకీయ నాయకుల వత్తిడి**

**జర్నలిస్టులకు స్వేఛ్ఛ , భద్రత రెండు లేవు**



సికింద్రాబాద్, సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి): సమాజంలో సమస్యపై ప్రశ్నిస్తూ రాసే స్వేఛ్ఛ జర్నలిస్టుల హక్కును హరించి వేస్తున్న రాజకీయ రౌడీయిజం మూకలు. సికింద్రాబాద్ బి ఆర్ ఎస్ పార్టీ రాజకీయ నాయకుడు సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావ్ గౌడ్ అనుచరుల మంటూ, మా పైనే వార్తలు రాస్తావా అని బెదిరింపులకు పాల్పడిన గ్యాంగ్. వివరాల్లోకెళ్తే ప్రముఖ ప్రజా ప్రశ్న పత్రికలో అక్రమ నిర్మాణాలపై కథనాలు ప్రచురితమయ్యాయి అందుకుగాను అధికారులు స్పందించడంతో కక్ష కట్టిన అక్రమ నిర్మాణదారులు జర్నలిస్ట్ ని తార్నాక తాజా కిచెన్ కి పిలిపించి సీనియర్ జర్నలిస్ట్ రామకృష్ణ, సతీష్ పై హత్యాయత్నానికి పాల్పడ్డారు. గాయపడ్డ జర్నలిస్టు సతీష్ వెంటనే లాలాగూడ పోలీస్ స్టేషన్ లో నిందితులపై ఫిర్యాదు చేశారు. హత్యాయత్నానికి ప్రయత్నించిన నిందితులకు రాజకీయ నాయకుల పలకుబడి ఉండడంతో పోలీసులపై ఎఫ్ఐఆర్ చేయకుండా తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చినట్లు సమాచారం. జర్నలిస్టులపై జరిగిన దాడిపై పోలీసుల సైతం సీరియస్ గా ఉన్న రాజకీయ నాయకులు పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారని సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా బీఆర్ఎస్ గుండాల దాడులు జరగడం విస్మయాన్ని కలిగిస్తుంది. పది సంవత్సరాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన దాడులను ఇప్పుడు కూడా చేయడం విడ్డూరంగా ఉందని దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్ గా స్పందించి బిఆర్ఎస్ గూండాయిజం అణచకుంటే భవిష్యత్తులో జర్నలిస్టులను మరింత ఇబ్బందులు కలిగే అవకాశాలు లేకపోలేదని జర్నలిస్టులు మండిపడుతున్నారు.

బీ ఆర్ ఎస్ రాజకీయ పార్టీ రాజకీయ నాయకులు చేసినా దౌర్జన్యాలకి ప్రజలు 2023 ఎన్నికలలో బీ ఆర్ఎస్ ను గద్దె దింపి రేవంత్ కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టారు. పదేళ్ల పాలనలో ఒక్క జర్నలిస్టును కూడా దగ్గరకు రానివ్వలేదు కేసీఆర్ ప్రభుత్వం. అదే రేవంత్ ప్రభుత్వం మద్దతు తెలిపి మొన్నటికి మొన్న జర్నలిస్ట సూర్యప్రకాష్ కు వైద్య సహాయం నిమిత్తం 10 లక్షలు మంజూరు చేసి అండగా నిలిచింది. ఇలా జర్నలిస్టుల వైపు ఉండే రేవంత్ కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులపై దాడులు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరుతున్నారు. "భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఎ) ప్రతి పౌరుడికి వాక్ స్వాతంత్ర్యం బావవ్యక్తీకరణ స్వేచ్ఛను ఇస్తుంది". అది హరించేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని రాజ్యాంగమే చెబుతోంది. ఇలా హరించే విధంగా కొన్ని రాజకీయ పార్టీల మూకలు ప్రయత్నిస్తే వారికి కఠినంగా శిక్షలు అమలుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలి లేనిచో వారు హత్యాయత్నాలకు పాల్పడడం కాదు వాటిని అమలుపరిచే మార్గంలో వెళతారు అనడానికి సందేహమే లేదు. ఈ సమస్యపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పందించి పోలీసు శాఖకు అత్యంత వేగంగా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా కేసును పరిష్కరించే దుశగా కృషి చేయాలని ఆదేశాలు జారీ చేయాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి.

## ఉత్తమ విద్యార్థులకు అవార్డ్స్ అందజేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- మండల స్థాయి క్రీడల్లో గెలుపొందిన ఉత్తమ విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యలు ఉన్నారు.యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ పాఠశాలలో మెరిట్ విద్యార్థినిలకు దిన శరణ్య స్వచ్ఛంద సేవ సంస్థ చింతల సాయిబాబా సహకారం తో అవార్డ్స్ ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అందజేశారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆలేరు మండల స్థాయి అండర్ 17-అండర్ 14 బాల బాలికల కొక్కో,వాలీబాల్,కబ్బడి, అథ్లెటిక్స్ ముంగింపు ఆటలు,బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అభినందించి వారితో కలిసి కబడ్డీ ఆడారు. అనంతరం వారికి బహుమతులను అందజేశారు.

## ఆలేరు మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**




భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- నేడు ఆదివారం ఆలేరు పట్టణంలో జరగబోయే ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్,వైస్ ఛైర్మన్,డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పిలుపునిచ్చారు.ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ సహకార,చేనేత శాఖ జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు,రోడ్లు భవనాల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరవుతున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,ప్రజాప్రతినిధులు, రైతులు,భారీ సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

# జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలికి వినతి పత్రం అందజేసిన టీజేఎస్ఎస్

**పద్మారావు నగర్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు**

**రెండు అంతస్తుల అనుమతులు, బహుళ అంతస్తులు నిర్మాణం వివరించిన నేతలు**

**నగరంలో అక్రమ నిర్మాణాల వల్ల జిహెచ్ఎంసి ఆదాయానికి భారీగా గండి అని సూచన**

**అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలంటూ కోరిన సంఘం నేతలు**

**జర్నలిస్టుల వినతిపై స్పందించిన కమిషనర్ ఆమ్రపాలి**




సికింద్రాబాద్, సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి): బీఆర్ఎస్ పార్టీ గుండాలు సీనియర్ జర్నలిస్ట్ రామకృష్ణ, సతీష్ ల పై తాజా కిచెన్ వద్ద జరిగిన దాడి ఘటన పై నిరసిస్తూ తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీధర్ యాలల ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ యాలల మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడి సహించేది లేదని కమిషనర్ ఆమ్రపాలి సైతం ఈ ఘటనను ఖండించారు. అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు కఠినంగా వ్యవహరించాలని జిహెచ్ఎంసి నియమ నిబంధనలను పాటించాలని ఆమె సూచించారు. అక్రమ నిర్మాణాల వద్ద పర్మిషన్ కాపీలను జిరాక్స్ తీసి అంటించాలని ఈ నిబంధనను టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచిస్తామని తెలిపారు. చెత్త తొలగింపు పై ఎలాంటి ఇబ్బందులు ఉన్న వెంటనే అధికారులకు తెలుపాలని రిపోర్టర్స్ సైతం చెత్తకు సంబంధించిన సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించే విధంగా కృషి చేయాలని సూచించారు. నార్త్ జోన్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు వెంటనే స్పందించి కూల్చివేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జర్నలిస్టులపై దాడికి పాల్పడ్డ బిల్డర్లకు సంబంధించిన అపార్ట్మెంట్ల పై సిసిపి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారని శ్రీధర్ తెలిపారు. జర్నలిజం వృత్తిగా ఎలాంటి జీతాలు లేకుండా సమాజసేవే ధ్యేయంగా పీజీలు చదివి సమాజంపై పూర్తి అవగాహనతో అన్ని కోణాలలో ఆలోచించి సమాజ అభివృద్ధి కోసం పాల్పడే జర్నలిస్టులపై అక్రమ నిర్మాణాలు చేసే బిల్డర్లు దాడులకు దిగితే ఉపేక్షించేది లేదని తెలియజేశారు.

ప్రస్తుతం కొంతమంది నకిలీ జర్నలిస్టులు అక్రమ నిర్మాణాల దగ్గరికి వెళ్లి 500 కు 1000 కి చేయి చాపడం వల్లే విలేకరులు అంటే సమాజంలో అడుక్కునే వారిలా చూస్తున్నారని నిజంగా జర్నలిజం చేసే రిపోర్టర్లు మొదటగా వార్తలు రాసి అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం వాళ్ళ విధి అన్నారు. ఈ తరహా జర్నలిజంను మార్చేందుకు పూనుకున్నారు టీజేఎస్ఎస్ సెక్రటరీ రామకృష్ణ. ఓ పత్రికలో అక్రమ నిర్మాణం పై కథనాలు వస్తే అధికారులు స్పందించి చర్యలు చేపట్టి వాటిని నిర్మూలించాలి కానీ వీటికి భిన్నంగా జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు, చైన్ మెన్లు పలానా పత్రికలో ప్రచురించడం వల్ల కూల్చివేతను చేస్తున్నామంటూ వెళ్లి వారి జేబులు నింపుకొని చేతులు దులిపేసుకుంటూ జిహెచ్ఎంసి ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ విషయంపై జిహెచ్ఎంసి కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి గౌట్టి రామకృష్ణ, అధికార ప్రతినిధి బాపట్ల కృష్ణమోహన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కీర్తి రాజ్, కోటేష్ లు పాల్గొన్నారు.

**నార్త్ జోన్‌లో అక్రమ నిర్మానాలపై పూర్తి చర్యలు తీసుకుంటాం: సిసిపి శ్రీనివాస్**

నార్త్ జోన్ సికింద్రాబాద్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఇటీవల పత్రికల్లో కథనాలు వస్తున్నాయని వీటిని పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నామని అక్రమ నిర్మాణాలు చేయడమే కాకుండా బిల్డర్లు జర్నలిస్టుపై దాడులు చేయడం బాధాకరమన్నారు. పద్మారావు నగర్ లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై అక్కడ చైన్ మెన్ జగదీష్ హస్తం పూర్తిగా ఉందన్న సమాచారం ఉందని ఆయన అవినీతి అక్రమాలపై అనేక ఫిర్యాదులు ఉన్నాయని ఆయనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.




## స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):- స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 10.30 ని.లకు స్థానిక గాంధీ పార్కు నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు గౌరవ చైర్ పర్సన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు,మున్సిపల్ కమిషనర్ పి. రామాంజుల రెడ్డి కార్యక్రమములో పాల్గొని పట్టణ ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తా వద్ద టైమ్స్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు, మహిళలు పురపాలక అధికారులు, సిబ్బందితో మానవ హారం చేసి ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమములో గౌరవ సభ్యులు, కళాశాల ఉపాధ్యాయులు, అధికారులు, మహిళలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## గౌడు ఐక్యతకై ముందుకు సాగండి

**తెలంగాణ గౌడ సంఘం నాయకులు పల్లె లక్ష్మణరావు గౌడ్**
**లబద్దం ధనుంజయ్ గౌడ్ పిలుపు**

ఖమం :- సెప్టెంబర్ 21బీ( వాయిస్ టూ డే) తెలంగాణ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు కత్తి నెహ్రూ గౌడ్ అధ్యక్షతన ఎన్.ఎస్.పి రోడ్డు నిర్మల హృదయ స్కూల్ పక్కన రెసిడెన్షియల్లో జరిగిన సమావేశంలో తెలంగాణ గౌడ సంఘం నాయకులు పల్లె లక్ష్మణరావు గౌడ్ ,బద్దం ధనుంజయ్ గౌడ్, మాట్లాడుతూ తెలంగాణ గౌడ సంఘం పోరాటంలో భాగంగా, ఖమ్మం జిల్లాలో 30 గుంటల భూమిని గౌడ సంఘానికి ప్రభుత్వం కేటాయించిందని, ఈ స్థలాన్ని పర్యవేక్షించిన. తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మణరావు గౌడ్, ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్, స్థలాన్ని పరిశీలించి ఇట్టి స్థలంలో తెలంగాణ గౌడ సంఘం, తెలంగాణ గౌడ హాస్టల్ నిర్మాణం చేపడతామని తెలిపారు ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా గౌడ సంఘం నాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పల్లె లక్ష్మణరావు గౌడ్, తెలంగాణ గౌడ సంఘం ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్ ,మాట్లాడుతూ తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ గౌడ సంఘాలని, గౌడ హాస్టల్ లని నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలను గౌడ సామాజిక వర్గానికి అందాల్సిన ప్రతి హక్కులను వచ్చే వరకు పోరాడుతామని తెలిపారు. గౌడ సంక్షేమానికి ప్రభుత్వం నిధులు కేటాయించేలా కృషి చేస్తామని తెలిపారు.తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మణరావు గౌడ్ తెలంగాణ గౌడ సంఘం ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్ ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం మహిళ అధ్యక్షురాలు అనురాధ గౌడ్, గౌడ సంఘం కార్యదర్శి కళ్యాణ్ గౌడ్, ఖమ్మం గౌడ సంఘం నాయకులు డాక్టర్ నరసయ్య చింతలపాడు వెంకటేశ్వరరావు గౌడ సంఘం కార్మికులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బహుజనుల దార్శనికుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ

**బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**



కరీంనగర్ సెప్టెంబర్ 21(వాయిస్ టుడే)కొండా లక్ష్మణ్ బాపూజీ అణగారిన వర్గాలకు భీష్మ పితామహుడని, బలహీన వర్గాలకు బాపూజీ ఆశా జ్యోతి లాగా నిలిచారని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కొనియాడారు. శనివారం రోజున బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కరీంనగర్లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం కృషి చేసిన తొలి తరం ఉద్యమకారుడు, బడుగు బలహీన వర్గాల స్ఫూర్తిదాత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కి బిజెపి జిల్లా పక్షాన ఘన నివాళులు అర్పిస్తున్నట్టు చెప్పారు. నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదిరించి హైదరాబాద్ సంస్థానపు పోరాట ఉధృత స్వభావాన్ని ఉవ్వెత్తున ఎగిసిపడేలా చేసిన ఉద్యమ కెరటం కొండా లక్ష్మణ్ బాపూజి అని అన్నారు. నేడు దేశంలోనే అత్యున్నత పారిశ్రామిక ప్రాంతాలుగా విలసిల్లుతున్న హైదరాబాద్ పారిశ్రామిక కారిడార్లు బాపూజీ దూర దృష్టికి దర్శనికతకు నిలువెత్తు నిదర్శనం అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం లాంటిదన్నారు. ఇట్టి కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులువాసల్గిలపు రమేష్, మాజీ ఎంపీపీ వాసల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కళ్లెం వాసుదేవ రెడ్డి, దండు కొమరయ్య, ఎడమ సత్యనారాయణ రెడ్డి, వంగలపవన్, ప్రవీణ్ , అసెంబ్లీ కన్వీనర్ దుబ్బాల శ్రీనివాస్ , మాసం గణేష్ , కైలాస నవీన్, రాజు , సంతోష్ , లతోపాటు బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ , నాయకురాలు వరాల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.





## పట్టభద్రుల అభ్యున్నతికై ఏర్పడ్డ టిజిఎఫ్

## పోస్టర్‌ను మరియు కండువా ఆవిష్కరణ



జగిత్యాల జిల్లాలోని ప్రముఖ కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని శనివారం రోజున కుటుంబ సమేతం గా దర్శించుకున్న డాక్టర్ సాయి కృష్ణ ప్రియా - డా., బండారి రాజ్ కుమార్ - తెలంగాణ మెడికల్ కౌన్సిల్ మెంబర్ & కరీంనగర్ లోని ఆర్కే హాస్పిటల్స్ చైర్మన్. ఈ సందర్భం గా ఆలయా అర్చకులు హారతినిచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. దర్శనాంతరం దేవాలయ ఆవరణ లో తెలంగాణ గ్రాడ్యుయేట్స్ ఫోర్స్ ( టిజిఎఫ్ ) కండువా , పోస్టర్ లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రానున్న కరీంనగర్ , అదిలాబాద్ , నిజామాబాద్ , మెదక్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎలక్షన్ లో పట్టభద్రులు ఐదు లక్షల పై చిలుకు ఓటర్లు గా తమ ఓటు హక్కు సెప్టెంబర్ 30 నుంచి ప్రారంభమయితున్నందున నమోదు చేసుకునేలా మరియు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎలక్షన్ లో ఓటు హక్కు వినియోగిచేలా కృషి చేయుట టిజిఎఫ్ ప్రధాన ఉద్దేశ్యం. అంతేకాకుండా నిరుద్యోగ పట్టభద్రుల ఉపాధి కల్పన కొరకై పాలకుల దృష్టి కి తీస్కెల్లి పరిష్కారానికి కృషి చేయుట. ఈ సందర్భం గా మల్యాల ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకుల బృందాన్ని , మరియు జగిత్యాల లో గల ఎస్ కే ఎన్ ఆర్ డిగ్రీ కాలేజ్ అధ్యాపక బృందాన్ని , ప్రముఖ ప్రయివేట్ హాస్పిటల్ యాజమాన్యాలను కలిశారు. ఈ కార్యక్రమం లో డా., గౌతమ్ , డా., సందీప్ , దొడ్ల దేవేందర్ , జగిత్యాల జిల్లా టిఎంకె జర్నలిస్ట్ ఫోరమ్ అధ్యక్షులు రమేష్ వంగల పటేల్ , అనిల్ , పెంచల శ్రీనివాస్ , దామోదర్ తదితరులు పాలొన్నారు.



## తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం పోరాడిన నేత కొండా లక్ష్మణ్ బాపూజీ

చిగురుమామిడి (వాయిస్ టుడే): తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం తన జీవితకాలం పోరాడిన తొలితరం నేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వంగర మల్లేశం అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతిని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం చిగురుమామిడి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంగర మల్లేశం మాట్లాడుతూ తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన బాపూజీ స్ఫూర్తి రాష్ట్ర సాధన పోరాటంలో ఇమిడివున్నదన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని వారి కృషిని పద్మశాలి సంఘం నాయకులు స్మరించుకున్నారు. పద్మశాలి రాజకీయ విభాగ రాష్ట్ర అధికారప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ నేత మాట్లాడుతూ బాపూజీ ప్రదర్శించిన నిక్కచ్చితనం, నిరాడంబరత లక్ష్య సాధనకోసం తాను కనబరిచిన పట్టుదల సమాజాన్ని ప్రభావితం చేశాయని అన్నారు. న్యాయవాదిగా, రాజనీతిజ్ఞుడుగా స్వాతంత్రోద్యమకాలం నుంచి రాష్ట్ర సాధన చివరిదశ దాకా బాపూజీ చేసిన కృషిని రేపటి తరాలకు ఆదర్శమని దాసరి ప్రవీణ్ నేత అన్నారు. ప్రజాపాలనలో టెక్స్ టైల్స్ అండ్ హ్యాండ్లూమ్ వర్సిటికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుగా మారుస్తూ నిర్ణయం తీసుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి మంచికట్ల కనకయ్య, చిగురుమామిడి గ్రామ అధ్యక్షుడు బైరి శ్రీనివాస్, నాయకులు నరాల రాజయ్య, బొల్లబొత్తిని రవీందర్, నరాల తిరుపతి, దాసరి సదానందం, ఎన్నం వెంకటేశం, మోర పద్మనాభం, వంగ శ్రీహరి, మోర కనకయ్య, దాసరి రవి, చిమ్మన నాగరాజు, బల్లు శేఖర్, సుధాకర్, మోర వీరయ్య, తిరుపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసియన్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైన బొమ్మనపల్లి యువకుడు

**దేశస్థాయిలో 30మందిలో తెలంగాణ తరపున రవికుమార్ ఎంపిక**

**హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు**



చిగురుమామిడి (వాయిస్ టుడే): ఆసియన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024 విద్యారంగంలో విశేష కృషి చేసినందుకు గాను కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన గంప రవికుమార్ ఎంపికయ్యారు. నవంబర్ 30న హర్యానాలో జరిగే ఈ కార్యక్రమంలో రవికుమార్ మాజీ కేంద్ర మంత్రి మణిశంకర్ ఐయర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. దేశంలో 30 మందికి అవార్డులను ప్రకటించగా అందులో రవికుమార్ తెలంగాణ రాష్ట్రం తరఫున ఎంపికయ్యారు. రవికుమార్ సిఏ విద్యను అభ్యసిస్తూనే 2014 నుండి లెక్చరర్ స్థాయి నుండి హనుమకొండలోని శ్రీమేధావి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహిస్తున్నారు. రవికుమార్ పాఠశాల స్థాయిలో, రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇన్సలబేర్గ్ ఇంటర్నేషనల్ సంస్థ ద్వారా అంతర్జాతీయ కామర్స్ కోర్స్ లపై అవగాహన కల్పిస్తూ రవికుమార్ తనదైనా ముద్ర వేశారు. అటు రాజకీయ రంగంలో చురుగ్గా పాల్గొంటున్నందుకు తెలంగాణ రాష్ట్రం నుండి రవికుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ తనకు ఈ అవార్డు రావడం గర్వకారణం అని, ఎంపిక చేసిన జ్యూరీ కమిటీ సభ్యులకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గంప రవికుమార్ ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల బొమ్మనపల్లి గ్రామ ప్రజలతో పాటు, మండల ప్రజలు, హన్మకొండ శ్రీ మేధావి జూనియర్ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో ఇలాంటి అవార్డులు పొందాలని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## మున్సిపల్ సర్వసభ్య సమావేశం బహిష్కరించిన పాలకవర్గం

హుజూరాబాద్ సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే): హుజురాబాద్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం శనివారం అధికారులు రాలేదన్న కారణంతో కౌన్సిలర్లు బహిష్కరించి సమావేశం నుండి బయటకు వెళ్లిపోయారు. గత కొన్ని సమావేశాల నుండి మున్సిపల్ అధికారులలో కొందరు సమావేశానికి హాజరు కావడం లేదని దీనివల్ల పరిపాలన ఇబ్బంది అవుతుందని వారన్నారు. సమావేశానికి అందరూ అధికారులు హాజరైనప్పుడే వస్తామని కౌన్సిలర్లు అన్నట్లు తెలిసింది. దీంతో సర్వసభ్య సమావేశం మరోసారి అధికారులందరూ హాజరయ్యేలా చూసి సమావేశం నిర్వహిస్తామని కమిషనర్ సమ్మయ్య తెలిపారు. వివిధ కారణాలతో ప్రజాప్రతినిధులు జనరల్ బాడీ సమావేశాన్ని బహిష్కరించడం తెలిసిందే కానీ అధికారుల గైర్హాజర్ ను నిరసిస్తూ సభను బహిష్కరించడం చర్చనీయాంశముగా మారింది.



## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం**
**హుజరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఇంగిలే రామారావు**

ఇల్లందకుంట సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే): కొండా లక్ష్మణ్ బాపూజీ గారి చిత్రపటానికి12 వ వర్ధంతి సందర్భంగా ఘనంగా పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఇంగిలే రామారావు మాట్లాడుతూ క్విట్ ఇండియా పోరాటం, గైర్ ముల్కి ఆందోళన తెలంగాణ ఉద్యమంలో తనదైన పాత్ర పోషించిన స్వాతంత్ర సమరయోధులు తెలంగాణ సాధన కోసం పదవులు సైతం వదులుకొని మలిదశ ఉద్యమానికి మార్గదర్శకంగ నిలిచిన తన జీవితాంతం బడుగు బలహీన వర్గాల కోసం పాటుపడిన ప్రముఖ సామాజికవేత్త కొండా లక్ష్మణ్ బాపూజీ గారు అని స్వరాష్ట్రం కోసం పరితపించిన తెలంగాణ వాది నిబద్ధత కలిగిన రాజకీయవేత్త స్వాతంత్ర సమరయోధులు అని ఆయన సేవలను స్మరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎండి సలీం రమేష్ మల్లేష్ అశోక్ మహేందర్ సమ్మయ్య రాజు మురళి తదితరులు పాల్గొన్నారు.

## బోయినపల్లి మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం

**చైర్మన్‌గా బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్‌గా నిమ్మ వినోద్ రెడ్డి**





చైర్మన్ ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ నిమ్మ వినోద్

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి సెప్టెంబర్ 21: బోయినపల్లి ఏఎంసి పాలకవర్గాన్ని శనివారం ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్ గా బోయినపల్లికి చెందిన బోయిని ఎల్లేష్ యాదవ్ ,వైస్ చైర్మన్ గా దేశయిపల్లికి చెందిన నిమ్మ వినోద్ రెడ్డి ని నియమించారు. డైరెక్టర్లు గా అనుముల హరికృష్ణ ,మమ్మద్ యూసఫ్ ,బాలగోని వెంకటేశ్వర్లు, అద్దంకి రమేష్, గుడి రాజశేఖర్ రెడ్డి,గంగిపల్లి లచ్చయ్య, నీరటి ప్రదీప్, కల్లేపల్లి సతీష్, మెరుపుల మహేష్, రోమాల అజయ్, ఏనుగుల కనకయ్య, జక్కని సందీప్ తో పాటు బోయినపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ,అగ్రికల్చర్ ఏడిఏ వేములవాడ బోయినపల్లి గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ లను సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ తుమ్మల నాగేశ్వర్ రావు,రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ,చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లతో పాటు బోయినపల్లి మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



## గాంధీభవన్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం

**హాజరైన హుజూరాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వొడితల ప్రణవ్ బాబు**

హుజూరాబాద్ సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే): శనివారం రోజు హైదరాబాద్ గాంధీభవన్ లో టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐసిసి ఇంచార్జి దీపాదాస్ మున్షి హాజరు అయ్యారు. కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,పొన్నం ప్రభాకర్ , శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి .ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ, హుజురాబాద్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వోడితల ప్రణవ్ లు పాల్గొని పలు అంశాలపైన చర్చించారు.

# వానాకాలం ధాన్యం కొనుగోళ్ళకు కార్యాచరణ పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేయాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**రైతులు నాణ్యత ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి**

**జిల్లా వ్యాప్తంగా 203 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**



వరంగల్ ( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 21: వానాకాలం ధాన్యం కొనుగోళ్ళకు పటిష్ట కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానాకాలం ధాన్యం కొనుగోలు కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై వ్యవసాయ, పౌర సరఫరాలు, సహకార, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ, తూనికలు, కొలతల శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 వానాకాలం ధాన్యం కొనుగోలుకు సన్నదం కావాలని అన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ సంవత్సరంలో 2 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, 203 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు , టార్పాలిన్స్, గన్ని బ్యాగులు, తేమ సాంద్రత కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లాలో సన్నరకం ధాన్యం ఎక్కువ సాగుచేసారని తెలిపారనీ , ఈ సంవత్సరం వ్యవసాయ శాఖ అధికారులు ఆయా మండలాల వారీగా ధాన్యం పండించిన రైతులు వివరాల నివేదిక అందించాలని ఆదేశించారు. ఈ సీజన్లో ఏ గ్రేడ్ రకం క్వింటాలు ధాన్యానికి రూ.2320, కామన్ రకానికి రూ.2300 ప్రభుత్వం ధర నిర్ణయించిందని సన్నరకం ధాన్యానికి ప్రోత్సాహకం ఇస్తున్నందున అన్ని కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం గుర్తింపు కోసం గ్రెయిన్ కాలిఫర్స్(డయల్ మైక్రోమీటర్) అందుబాటులో ఉంచాలన్నారు. సన్న, దొడ్డు రకాల ధాన్యం గుర్తింపులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వ్యవసాయ అధికారుల నివేదిక ఆదారంగా కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని కలెక్టర్ సూచించారు. ఎలక్ట్రానిక్ కాంటాలు ఉపయోగించాలని, ధాన్యం తూకం విషయంలో అవకతవకలు జరగకుండా చూడాలని తూనికలు, కొలతల శాఖ అధికారి తనిఖీలు నిర్వహించి సీల్స్ పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలో పండించిన ధాన్యం మిల్లింగ్ చేసేందుకు మిల్లులను ట్యాగింగ్ చేయాలని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు రవాణా చేసేందుకు సౌకర్యం కల్పించాలని రవాణాశాఖ అధికారులకు సూచించారు.

అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా ధాన్యం నిలువ చేయడానికి అనుకూల స్థలాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా ఎంచుకోవాలని సూచించారు. ధాన్యం రవాణా, ట్రాక్ షీట్ విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని, రైతులు దళారులను నమ్మి మోసపోకుండా నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయాలు చేసే విధంగా తగు సూచనలతో కూడిన కరపత్రాలను, ఫ్లెక్సీలను , గ్రామాలలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్రమాలకు, తక్కువ ధరకు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాలలో సన్నరకం ధాన్యం, దొడ్డురకం ధాన్యం రాసులను వేరు వేరుగా నిల్వ చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్ చార్జులకు కొనుగోలు ప్రక్రియపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డిఎం సివిల్ సప్లై సంధ్యారాణి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఉమారాణి, డిఎం సురేఖా, డిఆర్డీఓ కౌసల్య దేవి, డిసి ఓ నీరజ, డిఎఓ అనురాధ, జిల్లా తునికల కొలతల అధికారి రియాజ్, రైస్ మిల్లర్లు, గుత్తేదారులు, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.



## హుజూరాబాద్ ఆర్ డి ఓకి జమ్మికుంట మండల కేంద్రంలో వినతిపత్రం

**తెలంగాణ ఉద్యమకారులఫోరం**

జమ్మికుంట సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే): తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల ఫోరం పక్షాన ప్రభుత్వాన్ని కోరడం జరిగింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించిన ప్రభుత్వంగా చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని నాయకులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అనేక వర్గాలకు పెద్దపీట వేస్తుందని., అలాగే తెలంగాణ ఉద్యమకారుకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెన్షన్ అమలు చేయాలని, తెలంగాణ ఉద్యమకారుకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని తెలంగాణ ఉద్యమకారుల పక్షాన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అద్యక్షులు కనకం కుమారస్వామి, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ ఎక్కటి సంజీవరెడ్డి, అరుకాల విరేషలింగం, ఊకంటి మల్లాచారి, తెలంగాణ ఉద్యమ విద్యార్థి నాయకులు జవ్వాజి కుమార్(జే.కె), కొమ్ము అశోక్, అన్నం ప్రవీణ్, దబ్బుట రాజు, ఆకుల రాజేందర్, మల్లేష్, మూడెడ్ల కుమార్, కంది దిలీప్ రెడ్డి, వెంకట్ రెడ్డి, బిజిగిరి శ్రీకాంత్, మద్దూరి శంకరయ్య, వాసాల రామస్వామి, రాం చంద్రమౌళి, రజినికాంత్, ఎర్ర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.





## కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను తప్పక అమలు పరచాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలువాల వీరయ్య**

దంతాలపల్లి సెప్టెంబర్21(వాయిస్ టుడే): ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అలవాల వీరయ్య కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం రోజున దంతాలపల్లి మండలం దాట్ల గ్రామంలో కొమ్మినేని వెంకట్రాం నరసయ్య అధ్యక్షతన గ్రామ శాఖ మహాసభ లో ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం మహబూబాబ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు అలవాల వీరయ్య అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఇచ్చిన హామీ గాలికి వదిలేసారని, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర హామీని తక్షణమే అమలు చేయాలని వారు కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామన్నారు వెంటనే అందజేయాలని, అలాగే ఉపాధి కూలీలకు రోజు వేతనం 400, పేద మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇవ్వాలని, కొత్త రేషన్ కార్డులు, ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని వారు ఈ సందర్భంగా కోరారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి గా కొమ్మినేని వెంకటరామనర్సయ్య ను ఏక గ్రీవంగా ఎన్నిక చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గునుగంటి మోహన్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకుబ్, మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్, బాణాల రాజన్న, పిఎన్ఎం జిల్లా నాయకులు బోర స్వామి, గ్రామ నాయకులు రామేశ్వరం వెంకటయ్య, సోమ లింగయ్య, పద్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.



## దూర ప్రాంత విద్యార్థినికి లయన్స్ క్లబ్ వారి చేయూత

దంతాలపల్లి సెప్టెంబర్21(వాయిస్ టుడే): లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు వారి ఆధ్వర్యంలో అధ్యక్షులు నవీన్ కుమార్ అధ్యక్షతన లైన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ 320ఎఫ్ జిల్లా మొదటి ఉప గవర్నర్ జన్మదిన సందర్భంగా కుమ్మరి కుంట్ల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వేములపల్లి కి చెందిన రాచకొండ పూజిత కి పాఠశాల గణిత ఉపాధ్యాయుడు లైన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి లయన్ తమ్మి రమేష్ ప్రోత్సాహంతో లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ లయన్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, లక్ష్మీనరసింహారావు, మరియు వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకులు రవీందర్రావు కోశాధికారి లయన్ శంకర్ మరియు లయన్ సభ్యులచే విద్యార్థినికి సైకిల్ అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రజనీకాంత్,యాక మల్లయ్య, వెంకన్న, హరిబాబు లు పాల్గొన్నారు.

## శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో సైన్స్ ఫెయిర్



వరంగల్ ( వాయిస్ టుడే) సెప్టెంబర్ 21: హనుమకొండ పద్మాక్షి కాలనీలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ లో శనివారం నాడు సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల విజ్ఞానదాయకమైనటువంటి ప్రదర్శనలు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమానికి మాజీ డైరెక్టర్ రవి కిరణ్ రెడ్డి, డాక్టర్ ఎలుకంటి సమ్మిరెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో పాల్గొన్నప్పుడే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారు అన్నారు.విషయపరిజ్ఞానం కోసం పుస్తకాలను అధ్యయనం చేయాలని విద్యార్థులకు సూచించారు.ఈ సందర్భంగా చక్కని ప్రదర్శనలు ఇచ్చినటువంటి విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి పొన్నాల సంయుక్త తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం

వరంగల్ ( వాయిస్ టుడే) సెప్టెంబర్ 21బీ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ (జిటిఏ) వరంగల్ జిల్లా వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేస్తు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వారికి, లెఫ్ట్ ఓవర్ వేకెన్సీలో ప్రమోషన్ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయులను శనివారం నాడు ఘనంగా సన్మానించారు. నగరంలోని శంభునిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమం జీటిఏ జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి ప్రకాష్ గౌడ్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలకు సన్మానం చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిటిఏ రాష్ట్ర అధ్యక్షులు కాసం ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గం రవి, అసోసియేట్ అధ్యక్షుడు బిల్లా కోటేశ్వర రావు, వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు బుచ్చిరెడ్డి, మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బోజు వీరాచారి మరియు మండల బాధ్యులు, సభ్యులు పాల్గొనడం జరిగింది.

## ఆల్ఫోర్‌లో అలరించిన ఫ్రెషర్స్ డే "రెవా రాప్లోడీ-2024"

కరీంనగర్ సెప్టెంబర్ 21(వాయిస్ టుడే)స్థానిక ఆల్ఫోర్స్ మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాలలో ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా "రెవా రాపోడీ-24" పేరిట శుభం గార్డెన్స్ లో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు స్వాగతోత్సవ వేడుకలను కళాశాల కరెస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ స్వాగతోత్సవ వేడుకలకు విశిష్ట అతిథిగా ఆల్ఫోర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ వి.నరేందర్ రెడ్డి, ముఖ్యఅతిథిగా ఆల్ఫోర్స్ లియోక్లబ్ అడ్వైజర్ కెప్టెన్ లయన్ డా.బి.మధుసుదన్ రెడ్డి వచ్చేశారు. ఈ సందర్భంగా వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... జీవితంలో ఉన్నత లక్ష్యాలని విద్యార్థి దశలోనే నిర్ధేశించుకొని వాటిని సాధించేందుకు కఠోరశ్రమతో గమ్యం వైపు అభివృద్ధి చెందేలా ప్రణాళిక రచించుకోవాలని ఉద్భోదించారు. జీవితంలో ఉన్నత శిఖరాలని అందుకొని తల్లిదండ్రులకు మరియు కళాశాలకు పేరు తేవాలని సూచించారు. కళాశాల కరెస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి మాట్లాడుతూ... క్రియాశీలక విద్య నైపుణ్యాభివృద్ధికి కళాశాలలో ఏర్పాటు చేసిన క్లబ్స్ ఎలా దోహదపడుతాయో వివరించారు. బి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యని ఛాలెంజింగ్ గా తీసుకోవాలని, వాటిని అధిగమించేందుకు శాయశక్తులా పోరాడాలని విద్యార్థులను ఉత్తేజపరిచారు. ఈ సభా కార్యక్రమాల తదుపరి విద్యార్థులు ప్రదర్శించిన డాన్సులతో వివిధ రకాల పాటలతో విద్యార్థుల సంబరాలు ఆహుతులని అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.



## ఏ ఏం సి చైర్మన్‌గా బోయిని ఏల్లేష్ యాదవ్ నియామకం పట్ల బోయినపల్లిలో సంబరాలు

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి సెప్టెంబర్ 21: బోయినపల్లి ఏఎంసి చైర్మన్ గా బోయినపల్లి మండల కేంద్రం కు చెందిన బోయిన ఎల్లేష్ యాదవ్ నియామకం కావడం తో బోయినపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకుల తో పాటు బోయినపల్లి గ్రామస్తులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ తో పాటు వైస్ చైర్మన్ వినోద్ రెడ్డిని డైరెక్టర్ లకు పలువురు శుభాకాంక్షలు తెలుపుతూ స్వీట్లను తినిపించారు టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బోయినపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ ఇప్పటివరకు మండల కేంద్రానికి ఎలాంటి నామినేటెడ్ పదవి రాలేదని ఏఎంసి చైర్మన్ పదవి మండల కేంద్రం కు చెందిన ఎల్లేష్ కు రావడం అభినందనీయమని ఇట్టి అవకాశం కల్పించిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు కృతజ్ఞతలు తెలుపుతున్నమన్నారు. కష్టపడ్డ వారికి కష్టపడ్డ వారికి కాంగ్రెస్ పార్టీ గుర్తింపు నిస్తుందని ఈ సందర్భంగా పరువురు పేర్కొన్నారు.



## తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలి

### ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ పిలుపు

వరంగల్ ( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 21: వరంగల్ నగరంలోని ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నాడు ఏర్పాటు చేయడం జరిగింది. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ స్వాతంత్రంలో ఉద్యమంలో పాల్గొని గాంధీ గారి అనుచరుడుగా పేరుపొంది ఆర్యవైశ్య ముద్దుబిడ్డగా కులమత అలకతీతంగా అనేక ఉద్యమాలు చేపట్టిన మహానీయులు తెలుగు భాషా రాష్ట్రాల్ని ఏర్పాటు చేయాలని ఒకే భాష మాట్లాడేవాళ్లంతా ఒకే రకంగా ఉండాలని భావనతో 56 రోజుల పాటు ఆమరణ దీక్ష చేపట్టిన మహానీయుడు పొట్టి శ్రీరాములు త్యాగాలను స్మరిస్తూ తెలంగాణ విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభలో పిలుపు లో భాగంగా వరంగల్ జిల్లాలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. వరంగల్ జిల్లా కేంద్రం లో నిరసన కార్యక్రమం చేపట్టాలని ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందించాలని అలాగే అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యేలకు,

ఏమ్మెల్సీ లకు వినతి పత్రాలు ఇవ్వాలని అయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అసెంబ్లీలో కూడా ఈ విషయం పై చర్చించి పొట్టి శ్రీరాములు గారి పేరును కొనసాగించే విధంగా తీర్మానం చేయాలని తెలంగాణ ఉద్యమంలో అనేక త్యాగాలు చేసిన సురవరం ప్రతాపరెడ్డి పేరును అనేక సంస్థలకు పెట్టుకునే అవకాశం ఉందనీ ఏ సంస్థ పెట్టిన అలాంటి త్యాగమూర్తులను మేము మద్దతిస్తామని శ్రీరాముల పేరు మాత్రం తీయకూడదని వారి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగేంద్రబాబు ఇమ్మడి శ్యాంబాబు అక్కినపల్లి రాజ్ కుమార్,అల్లాడి వీరభద్రయ్య, పాల మురళీధర్, పల్లా పరమేశ్వర్, దాచేపల్లి సీతారాం,యాద గణేష్, పుల్లూరు రఘుబాబు, అయిత రాజేంద్రప్రసాద్, మీత్తింటి సురేందర్, శ్రీధర్, పబ్బతి సత్యనారాయణ, ఇతరులు పాల్గొన్నారు

## కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్బంగా నివాళులు అర్పించిన పద్మశాలిలు



వరంగల్ ( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 21: వరంగల్ జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం నాడు కోత్తవాడలోని కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పద్మ శాలి ప్రముఖులు పూలమాలలు వేసి,అయన కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అడేపు రవీందర్ మాట్లాడుతూ,పద్మశాలి,లు రాజకీయంగా ఆర్థికంగా ఎదగాలని అన్నారు, ముఖ్య అతిధులుగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్ మాట్లాడుతూ,విలువలు,నిజాయతీ కల రాజకీయ గొప్ప నేత,మన బాపూజీ అని సేవలు కొనియాడారు. మరొక అతిథి తెలంగాణ పోపా రాష్ట్ర అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ,బాపూజీ కలల సాకారం కాంగ్రెస్ ప్రభుత్వం లో చూస్తున్నామని, నిజమైన తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిందని,అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త వోడ్నాల నరేందర్, గుండేటి నరేందర్,గోరంట్ల రాజు,బసాని శ్రీనివాస్, హన్మకొండ అధ్యక్షులు బచ్చు ఆనందం, చేనేత నాయకులు,పద్మశాలి నాయకులు పాల్గొన్నారు.




## కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో హెల్తీ అండ్ జంక్ ఫుడ్ మీద అవగాహన కార్యక్రమం

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 21 2024 (వాయిస్ టుడే) : బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో హెల్తీ ఫుడ్ అండ్ జంక్ ఫుడ్ మీద శనివారం రోజు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రదర్శననిస్తూ ఈ అవగాహన కార్యక్రమంలో పండ్లు కూరగాయల వంటి పోషకమైన ఆహార ప్రయోజనాలను వివరిస్తూ, అదేవిధంగా జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల హానికరమైన ప్రభావాలను కూడా వివరించడం జరిగింది. ఈ ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల ప్రాముఖ్యత విద్యార్థులకు పౌష్టిక ఆహరం అందించడం వల్ల విద్యార్థులు ఆరోగ్యం తో పాటు జ్ఞాపకశక్తి, శారీరక ఎదుగుదలను ప్రభావితం చేస్తుందని పాఠశాల యాజమాన్యం వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఈ రవి ప్రసాద్, ప్రిన్సిపల్ ఎం రాజా రమేష్ విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళా అభ్యుదయం కోసం కృషి చేసిన గురజాడ

భద్రాచలం, సెప్టెంబర్ 21 (వాయిస్ టు డే ) మహిళా అభ్యుదయం కోసం ఎంత గానో కృషి చేసిన గొప్ప సంస్కర్త గురజాడ అప్పారావు అని పలువురు వక్తలు నివాళులు అర్పించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో శనివారం గురజాడ అప్పారావు 162 వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హావీలా మాట్లాడుతూ సంఘ సంస్కరణోద్యము, మహిళా అభ్యుదయం కోసం గురజాడ వారు ఎంతో కృషి చేశారని కొనియాడారు. తెలుగు శాఖ ఇన్చార్జ్ డాక్టర్ రాంబాబు, హిస్టరీ అధ్యాపకులు డాక్టర్ కిరణ్ కుమార్, తెలుగు అధ్యాపకులు జాయ్ కిరణ్ వీరన్న, వరాల బాబు లక్ష్మీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన క్విజ్ పోటీలో గెలిచిన వారికి దుర్గా స్వీట్స్ అధినేత బిర్రు సుధాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొని బహుమతులను అందించారు.



# పారను చేత పట్టి పిచ్చి చెట్లను తొలగించి పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

### శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే సెప్టెంబర్ 21: జిల్లాలో ఈ నెల 17 నుంచి చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా యువజన క్రీడలు, జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖల ఆధ్వర్యంలో శనివారం లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ రామచంద్ర డిగ్రీ కాలేజీలో నిర్వహించిన శ్రమదానం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామచంద్ర డిగ్రీ కళాశాల ఆవరణలో క్రీడాకారులకు కావలసిన విశాలమైన స్థలం ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ నిధుల నుండి రన్నింగ్ ట్రాక్, హాకీ కోర్టు, వాలీబాల్ కోర్టు, స్విమ్మింగ్ పూల్, అన్ని రకాల క్రీడలకు సంబంధించిన సదుపాయాలు సమకూర్చుతామని తెలిపారు.కళాశాలలో పూర్వం చదువుకున్న విద్యార్థులు, సీనియర్ సిటిజన్స్, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు అందరూ సమిష్టిగా పనిచేసి కళాశాల మైదానాన్ని క్రీడాకారులకు మరింత సౌకర్యవంతంగా తయారు చేద్దామన్నారు. కళాశాల మైదానంలో పెరిగిన పిచ్చి చెట్లు గడ్డి పొదలు, పంచాయతీ సిబ్బందితో పాటు కళాశాల విద్యార్థులు కలిసి తొలగించాలని సూచించారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో మహిళలు తడి, పొడి చెత్త వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని దానివల్ల ప్రభుత్వానికి సహాయపడిన వారు అవుతారని అన్నారు. ప్రజలు, అధికారులు శానిటైజేషన్ సిబ్బంది సహకారం వల్ల అతి కొద్ది కాలంలో మన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను పరిశుభ్ర జిల్లాగా మార్చేందుకు కృషి చేద్దామని చెప్పారు. పరిసరాల పరిశుభ్రతే మనందరి బాధ్యతగా ముందుకు సాగాలని అని కలెక్టర్ అన్నారు. కొత్తగూడెం పాల్వంచ పట్టణాల్లోని ఖాళీ స్థలాలు, పార్కులను అభివృద్ధి పరిచి పిల్లలు ఆడుకోవడానికి వీలుగా మారుస్తామన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించు కోవడంలో ప్రజలు ప్రముఖ పాత్రను పోషించేందుకు గాను ప్రతి ఒక్కరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా యువజన క్రీడా అధికారి పరందామ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, విద్యాశాఖ నుండి సైదులు, ఎస్ ఆర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వనజ, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎంపీడీవో బీవీ చలపతి, ఎన్ఎస్ఎస్ అధికారి పూర్ణచందర్, హాకీ కోచ్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛత హి సేవ

రాయికల్ (వాయిస్ టుడే): రాయికల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, శనివారం రోజు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... స్వచ్ఛత మనందరి బాధ్యత అని, పరిసరాల పరిశు భ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలచే స్వచ్ఛత ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వెంకటి,మెప్మా సి ఓ శరణ్య, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీపతి రాఘవులు, పొన్నం రమేష్, పీఈటి పారిపెల్లి గంగాధర్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ బృందము, విద్యార్థులు పాల్గొన్నారు.




## కళ్యాణ లక్ష్మి చెక్కులను నేతన్నలకు చేయూత పథకం చెక్కులను, గ్యాస్ సబ్సిడీ పథకం పత్రాలను, పంపిణీ

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో స్వర్గీయ కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్ఎన్ గార్డెన్స్ లో కళ్యాణ లక్ష్మీ షాధిముబారక్, చేనేత మరియు జౌలీ శాఖ నేతన్నలకు చేయూత థ్రిఫ్ట్ ఫండ్ పథకం ద్వారా లబ్ధిదారులకు చెక్కులను,గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,అధికారులు, లబ్ధిదారులు పాల్గోన్నారు.

## జ్వర సర్వే నిర్వహించాలి

రాయికల్(వాయిస్ టుడే): రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ కు బి ఆర్ ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు ఇట్ సందర్భంగా రాయికల్ పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్ కుమార్ మాట్లాడుతు పట్టణంలో విష జ్వరాలతో ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవటం ఆశ్చర్యం గా ఉందని,గత బీఆరెస్ ప్రభుత్వ హయాం లో జ్వరాలు వస్తే ఇంటింటి సర్వే నిర్వహించి ఇంటికే మందులు పంపిణీ చేయటం జరిగిందని, ఈ ప్రభుత్వం లో మందులు ఇవ్వడం లేదని కనీసం ప్రజలకు జ్వరాలపై అవగాహన కూడ కల్పించక పోవటం బాధాకరం అని అన్నారు. ఇప్పటికైన ఆరోగ్య శాఖ మేల్కొని ఇంటింటి జ్వర సర్వే నిర్వహించి తగు జాగ్రత్తలు ప్రజలకు తెలియజేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తురగ శ్రీధర్ రెడ్డి,వల్లకొండ మహేష్ గౌడ్,మారంపెల్లి సాయి కుమార్,కన్నాక మహేందర్,నాయకులు శ్రీరాముల సత్యనారాయణ,ఏనుగందుల లింగం గౌడ్,సూతరి తిరుపతి, బాబా,పెండెల గణేష్, తిరుణగరి రాంచంద్రం,నేరెళ్ల వినోద్,లక్ష్మణ్,సొరపక మహేష్ తదితరులు పాల్గొన్నారు...



## నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బంది



రాయికల్(వాయిస్ టుడే): రాయికల్ మండలం ధావన్ పెల్లి బస్సులో చెల్లి పెల్లి రజిత అనే మహిళ తన దగ్గర గల 25,500 రూపాయలు పోగొట్టుకుంది అట్టి డబ్బులను బస్సులో ఉన్న డ్యూటీ కండక్టర్ మరియు డ్యూటీ డ్రైవర్ ఆర్ రాజారెడ్డి అంజి లకు దొరక గా నిజాయితీతో వ్యవహరించి దొరికిన డబ్బులను రజిత కు తిరిగి అందించి, నిజాయితీ చాటుకున్నారు ఇట్టి నిజాయితీ గలిగిన ఆర్టీసీ సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.



## దులీప్‌ట్రోఫీ క్రికెట్ మ్యాచ్ ను తిలకించిన ఆర్డిటి డైరెక్టర్ మాంచో ఫెర్రర్ కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. జిల్లా ఎస్పీ పి.జగదీష్

అనంతపురం, సెప్టెంబర్ 21 : వాయిస్ టుడే : దులీప్‌ట్రోఫీలో భాగంగా అనంతపురం నగరంలోని ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో ఆఖరి రౌండ్‌కు సంబంధించి ఇండియా బి, డి జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, జిల్లా ఎస్పీ పి.జగదీష్ తిలకించారు. శనివారం ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మ్యాచ్ ల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని ఏసీఏ త్రీమెన్ కమిటీ సభ్యులు మాంఛోఫెర్రర్ జిల్లా కలెక్టర్ కు వివరించడం జరిగింది. అనంతరం కాసేపు బి గ్రౌండ్ లో ఇండియా బి, డి జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ ను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ తిలకించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఎ ప్రెసిడెంట్ ప్రకాష్ రెడ్డి, ఆర్డిటి స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ, రంజీ క్రికెటర్ షాబుద్దీన్, డిఎస్డిఓ షఫీ, తహసిల్దార్ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ధర్మాజిపేట్ గ్రామస్తులకు ముత్యాల తలంబ్రాల పంపిణీ

### భద్రాచలంకు గోటి తలంబ్రాలను అందించిన ఘనత వీరిదే

### రామకోటి రామరాజు కృషి అమోఘమని గ్రామస్తుల సన్మానం

### కల్యాణ తలంబ్రాలు కళ్లారా చూసే భాగ్యం కలగడం మా గ్రామస్తుల అదృష్టం

వాయిస్ టుడే సెప్టెంబర్ 21( సిద్దిపేట్ జిల్లా ప్రతినిధి): సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని శ్రీరామకోటి భక్త సమాజం చేస్తున్న సేవకు గాను 100కిలోల ముత్యాల తలంబ్రాలను భద్రాచల దేవస్థానం అందించింది. వీటిని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది భక్తులే లక్ష్యంగా పంపిణి చేస్తున్నారు. శనివారం నాడు దుబ్బాక మండలం ధర్మాజిపేట్ గ్రామస్తులకు ఋషి విద్యాలయం వద్ద ముత్యాల తలంబ్రాల విశిష్టత తెలియజేసి భక్తులకు అందజేశారు సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడి గ్రామస్తులందరు కూడ పెద్ద ఎత్తుల రామనామాన్ని స్మరిస్తూ గోటితో ఒడ్లను ఓలిచి భద్రాచల కల్యాణనికి అందించారు. రామభక్తి అమోఘం అన్నారు. అందుకే తిరిగి వారికీ కల్యాణ ముత్యాల తలంబ్రాలు అందిస్తునన్నారు. ఈ సందర్భంగా తలంబ్రాలు అందుకున్న భక్తులు మాట్లాడుతూ రామకోటి రామరాజు కృషి, పట్టుదల వల్ల మా గ్రామానికి మొదటి సారిగా ముత్యాల తలంబ్రాలు రావడం మా అదృష్టం అన్నారు. రామకోటి రామరాజును కృషి, పట్టుదలకు గాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం ఋషి విద్యాలయ ఋషి విద్యాలయం కరస్పండెంట్ కారంపురి రవి పాల్గొన్నారు.

# రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు: రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

## పిడింగొయ్యి గ్రామంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే




రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి) : రాష్ట్రం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి వైపు పయనిస్తుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. శనివారం సాటిలైట్ సిటీ సి.బ్లాక్ కళ్యాణ మండపం లో ఏర్పాటుచేసిన "ఇది మంచి ప్రభుత్వం" అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల్లో ఏం జరిగిందో జరుగుతుందో ప్రజలు కూడా తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన నిర్వకం వల్ల అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తం అయ్యాయన్నారు. అపార అనుభవం ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అటు సంక్షేమాన్ని, ఇటు అభివృద్ధిని గాడిలో పెడుతొందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చేసిన మొట్టమొదటి పని పెంచి ఇస్తానన్న పెన్షన్ 3000 రూపాయల నుండి 4000 రూపాయలకి పెంచి ఏ నెల నుంచి అయితే ఇస్తాము అని అన్నామో ఆ మూడు నెలలుకి చెందిన మూడు వేలు కలిపి మొత్తం 7000 రూపాయలు అందజేశామన్నారు. గత ప్రభుత్వం మీ ఆస్తిపై హక్కులను హరిస్తూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం తీసుకువచ్చిందని, తద్వారా ఆస్తి హక్కు పత్రాలను ప్రభుత్వ తన స్వాధీనంలో ఉంచుకుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మీ ఆస్తి హక్కులకు భంగం కలగకుండా యధావిధిగా కొనసాగించేలా ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని పూర్తిగా రద్దు చేసిందని అన్నారు.నిరుద్యోగ యువతకు అండగా ఉండేందుకు మెగా డీఎస్సీ ద్వారా 16 వేల పైచిలుకు ఉపాధ్యాయ ఉద్యోగ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. పేదవాడికి ఐదు రూపాయలకే మంచి భోజనం అందించేందుకు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఈ సాటిలైట్ సిటీ గ్రామం తన దత్తత గ్రామం అని, ఈ గ్రామానికి అన్ని వసతులు కల్పించి సుందర వనంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు. అంతకు ముందు స్వచ్ఛత హి సేవా కార్యక్రమం లో భాగంగా పిడింగొయ్యి లోని. ఎస్ వి జి మార్కెట్ నుండి వి ఎల్ పురం వరకూ నిర్వహించిన స్వచ్ఛత హి సేవా ర్యాలీలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి , రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపు మేరకు స్వచ్ఛత హి సేవా కార్యక్రమం లో భాగంగా గ్రామాలలో, మన పరిసరాల్లో పరిశుభ్రత పాటించడం , పరిరక్షణ చర్యలు తీసుకోవడం పై ప్రజల్లో అవగాహన చైతన్యం కలిగించే విధంగా ర్యాలీలు నిర్వహించినట్లు చెప్పారు. మన పరిసరాల్లో, మనం నివసించే ప్రాంతంలో పరిశుభ్రత పాటించడం మనందరి సామాజిక బాధ్యత అని శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు మార్ని వాసుదేవ్, మండల ప్రత్యేక అధికారి కే ఎన్ జ్యోతి, ఎం.పీ.డీ.వో డి.శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు వాసిరెడ్డి బాబి, దారా అన్నవరం, ఎమ్మెస్సార్ శ్రీను, బండారి సత్తిబాబు, నిచ్చనికోళ్ళ సత్తిబాబు, పెంకె కోటేశ్వరరావు, సరోజినీ దేవి, గెద్దాడ కృష్ణ, చౌడాడ లాజర్, బెంజిమెన్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## 11వ వార్డులో పోషణ అభియాన్ మాసోత్సవాలు

భద్రాద్రి కొత్తగూడెం/వాయిస్ టుడే : కొత్తగూడెం మున్సిపాలిటీ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ అభియాన్ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. 11వ వార్డులోని చిట్టిరామవరం తండా అంగన్వాడి 1,2 వ సెంటర్లో ఏర్పాటు చేసిన పోషణ అభియాన్ లో అంగన్వాడి సూపర్వైజర్ పార్వతి,11వ వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ పోషణ మాసంలో భాగంగా గర్భిణీలకు, బాలింతలకు అంగన్వాడీ అందించే పౌష్టిక ఆహారం తిని బిడ్డ ఆరోగ్యంగా పుట్టేలా చూడాలని అన్నారు. గర్భిణీగా ఉన్నప్పుడు అంగన్వాడి సెంటర్లో ఒక పూట సంపూర్ణ భోజనం గ్రుడ్డు, పాలు, కూరగాయల భోజనం తో తల్లి, బిడ్డల ఆరోగ్యంగా ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. గర్భిణీలు, బాలింతల కు వచ్చే అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యకరమైన రక్షణ పొంది పరిణితి పొందుతారని అన్నారు. ఆకు కూరల, చిరుధాన్యాల ద్వారా పోషకాలు ఎక్కువగా పొందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు శ్రీదేవి, తులసి బాయ్, ఆయాలు మీనా, కళ్యాణి, గర్భిణీలు, బాలింతలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకుల వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల నిరసన



రామకృష్ణాపూర్ సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే): ఢిల్లీ బిజెపి నాయకులు తన్విదర్ సింగ్, రైల్వే శాఖ సహాయ మంత్రి రావ్ నీత్ సింగ్ చేసిన వివాదస్పద వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. పట్టణంలోని క్యాతనపల్లి క్రాస్ రోడ్ ఎమ్ ఎన్.ఆర్ గార్డెన్స్ హైవే రోడ్డుపై బైఠాయించారు. అనంతరం దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా టిపీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథరెడ్డి మాట్లాడుతూ. దేశానికి సేవ చేసిన కుటుంబం, దేశం కోసం ప్రాణాలు విడిచిన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీ పైన బిజెపి నేత తన్వీర్ సింగ్ చేసిన వాక్యాలను ఖండిస్తూ అలాగే కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రావ్ నీత్ సింగ్ బిట్టు మతాన్ని అడ్డం పెట్టుకొని చేసే కుట్రపూరిత రాజకీయాలను బిజెపి ఇకనైనా మానుకోవాలని వారి దిష్టిబొమ్మలను దగ్ధం చేయడం జరిగిందని అన్నారు. ప్రధానమంత్రి హోదా కలిగిన రాహుల్ గాంధీ పైన బీజేపీ చేసే కక్షపూరిత రాజకీయాలను తెలంగాణలో చేయనిచ్చేది లేదని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త రాహుల్ గాంధీకి అంగరక్షకులుగా ఉంటూ అనునిత్యం రాహుల్ గాంధీని కాపాడుకుంటామని బిజెపి నాయకులకు సవాల్ విసిరారు. బిఆర్ఎస్, బిజెపి నాయకులను చెన్నూరు నియోజకవర్గం లో జరిగే అభివృద్ధి కార్యక్రమాల పైన అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేక నీచ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇకనైనా అలాంటివి మానుకొని అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య ,జిల్లా అధికార ప్రతినిధి ఓడ్నాల శ్రీనివాస్, మహంకాళి శ్రీనివాస్, క్యాతనపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ ఉండాలి

### ప్రభుత్వ నిషేధిత గంజాయి రవాణాను అరికట్టడంలో బాధ్యతగా వ్యవహరిస్తున్న పోలీస్ అధికారుల తీరు ప్రశంసనీయం

### శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి

### నెలవారీ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే సెప్టెంబర్ 21: శనివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.జిల్లాలో భారీ వర్షాల కారణంగా ఏర్పడిన వరదల సమయంలో,గణేష్ నవరాత్రులు,నిమజ్జన కార్యక్రమాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అంకితభావంతో అహర్నిశలు ప్రజలకు సేవలాందించిన పోలీస్ అధికారులు సిబ్బందికి ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు కృతజ్ఞతలు తెలియజేశారు.భవిష్యత్తులో ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోనే విధంగా నమ్మకాన్ని కలిగించారని ప్రశంసించారు.కొత్త కొత్త టెక్నాలజీలతో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల ఖాతాల నుండి నగదు మాయం చేస్తున్నారు.సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలకు అనునిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ వారిని అప్రమత్తం చేయాలని తెలిపారు.ప్రతీ కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి "క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్" ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా బాధ్యతగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు.దొంగతనం కేసుల్లో చోరీ సొత్తును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు.గంజాయి లాంటి మత్తు పదార్థాలను రవాణా చేసే వారితో పాటు సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహారించాలని తెలిపారు.గుట్కా,మట్కా,జూదం,బెట్టింగు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని తెలిపారు.రౌడీషీటర్లు పాత నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేసుకుని వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు.బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తుల పట్ల కఠినమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని తెలిపారు.జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రదేశాలను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ నివారణాచర్యలు చేపట్టాలని సూచించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వారి కదిలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.అనంతరం గత నెలలో వర్టికల్స్ వారీగా అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన పోలీస్ అధికారులు సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వర్ ఐపిఎస్,ఇల్లందు డిఎస్పీ చంద్రభాను,కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,ఎస్బి ఇన్స్పెక్టర్స్ నాగరాజు, శ్రీనివాస్,ఐటి సెల్ ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి,జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో జయరాజు సీఐలు,ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.



## పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి): పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్ ఆదేశించారు. జిల్లాలోని రాజానగరం పోలీస్ స్టేషన్ ను ఎస్పీ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ లలో భాగంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ చుట్టుపక్కల పరిసరాలను, రిసెప్షన్ కౌంటర్ మరియు స్టేషన్లోని వివిధ రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసులపై ఆరా తీశారు.పోలీస్ స్టేషన్ లో పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, శాంతి భద్రతలకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలని ఎస్పీ ఆదేశించారు. అలాగే మద్యం, గంజాయి, నాటుసారా అక్రమ రవాణను నియంత్రించాలని సూచించారు. ఎన్ఫోర్స్మెంట్ వర్క్ ని పెంచాలని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందితో ముఖాముఖి మాట్లాడుతూ, సిబ్బందికి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇన్స్పెక్టర్ (ఎస్.బి) ఏ. శ్రీనివాసరావు, రాజానగరం ఇన్స్పెక్టర్ ప్రసన్న వీరయ్య గౌడ్, రాజానగరం ఎస్సై,సిబ్బంది పాల్గొన్నారు.



## ముదిగొండ తహశీల్దార్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలు

### తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖుడు "కొండా లక్ష్మణ్ బాపూజీ " - ముదిగొండ తహశీల్దార్ సునిత ఎల్జిబెత్

ముదిగొండ మండలం సెప్టెంబర్ 21 వాయిస్ టుడే బీ ముదిగొండ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను తహశీల్దార్ సునిత ఎల్జిబెత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా బాపూజీ చిత్ర పటానికి పూలు వేసి నివాళులర్పించిన అనంతరం తహశీల్దార్ సునిత మాట్లాడుతూ నిరంకుశ నిజాం వ్యతిరేక, తెలంగాణ ఉద్యమ నాయకులలో ప్రముఖుడైన కొండా లక్ష్మణ్ బాపూజీ స్వాతంత్ర్యోద్యమంలో, నిరంకుశ నిజాం వ్యతిరేక ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారని అన్నారు.. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది యుడిసీ నాగలక్ష్మి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రసన్న కుమార్,జూనియర్ అసిస్టెంట్ రవీందర్, రమాదేవి,అబ్బాస్, ఆర్.ఏ కర్ణ,సత్యానందం, ధరణి ఆపరేటర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## సాయిని అభినందించిన హెడ్ మాస్టర్ మైత్రి

ముదిగొండ మండలం సెప్టెంబర్ 21 వాయిస్ టుడే: ముదిగొండ మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వాకధాని కన్నయ్య యాదవ్ కుమారుడు వాకదాని సాయి కృష్ణ యాదవ్ నేపాల్ లో జరిగిన ఇంటర్నేషనల్ కబడ్డీ పోటీలలో గెలుపొంది సిల్వర్ మెడల్ పతాకాన్ని అందుకోవడంతో న్యూ లక్ష్మీపురం గ్రామానికి మరియు అదే పాఠశాలలో చదివి సిల్వర్ మెడల్ పతాకాన్ని తీసుకువచ్చిన యువకుడు సాయి కృష్ణ ని న్యూ లక్ష్మీపురం జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయురాలు మైత్రి శనివారం శాలువాతో సత్కరించి పూల బొకే ఇచ్చి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వజీర్ పాషా, ధన్ రాజ్,వెంకటేశ్వర్లు,కవిత,పరసురాం,కిషన్, గ్రామ పంచాయతీ సెక్రటరీ దేగల సురేష్,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కోరట్ల పద్మ, గ్రామస్తులు బసవయ్య,నజీర్ తదితరులు ఉన్నారు.

## యాదాద్రి నృసింహుడు దర్శించుకున్న ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుమిదినీ

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట:యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుమిదినీ.ప్రత్యేక సంప్రదాయ స్వాగతం పలికిన ఆలయ అర్చకులు గర్భాలయంలో దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం చేసిన అర్చకులు స్వామివారి లడ్డు ప్రసాదం అందచేసిన ఆలయ ఈవో భాస్కర్ రావు.






## నూతనకల్లు మండల కేంద్రము నుండి సంగెం వరకు రోడ్డును పునర్ నిర్మాణం చేయాలి

సూర్యపేట , దక్షిణాది (ప్రతినిధి): సిపిఎం పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి జెండా ఊపి పాదయాత్ర ను ప్రారంభించారు. ఈరోజు సిపిఎం ఆధ్వర్యంలో సంగెం నుండి నూతనకల్లు వరకు పాదయాత్ర నిర్వహించి తహాశీల్దార్ కు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్ రెడ్డి, పులుసు సత్యం,దండ వెంకటరెడ్డి, సంజీవ రెడ్డి, బత్తుల జనార్ధన్, చిల్పకుంట్ల,వెంకేపల్లి, మాజీ సర్పంచ తుడి మధుసూదన్ రెడ్డి సంగెం గ్రామాల సిపిఎం కార్యకర్తలు,అటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## ఖో ఖో కబడ్డీ పోటీలో బహుమతులు పొందిన కూచూరు విద్యార్థులు

వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా నవాబుపేట మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి ఎస్ జి ఎఫ్ కబడ్డీ మరియు కోకో పోటీలలో కూచూర్ విద్యార్థులు అండర్ 17 మరియు అండర్ 14 లోఉత్సాహంగా పాల్గొని కోకో మరియు కబడ్డీ లలో మొదటి బహుమతి మండల స్థాయిలో గెలుపొందారు. విద్యార్థులకు మొదటి బహుమతి కాంగ్రెస్ నాయకులు హజార్ అలీ మరియు మండల నాయకుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.విద్యార్థులు మరియు పి ఈ టి వినోద్ కుమార్ మరియు కూచూర్ గ్రామస్తులు నాయకులు, అభినందనలు తెలిపారు. ఆటల పోటీలలో మరియు అన్ని రంగాలలో కూచూర్ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో కూడా మంచి ప్రతిభ కనబరుస్తారని ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ తెలిపారు.




## రామకృష్ణాపూర్ సివిల్ కార్యాలయంలో స్వచ్ఛతాహి సేవ 4.0 కార్యక్రమం

రామకృష్ణాపూర్ సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే): రామకృష్ణాపూర్ సింగరేణి సివిల్ కార్యాలయంలో శనివారం డివై ఎస్ఈ ఎస్.శ్రీధర్ ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్ సివిల్ కార్యాలయంలో లో స్వచ్ఛతాహి సేవ 4.0 కార్యక్రమంలో భాగంగా కార్యాలయం లోని స్క్రాప్ యార్డ్ చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో శుభ్రపరచడం జరిగింది, ఈ సందర్భంగా డివై ఎస్ఈ శ్రీధర్ మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ ఆదేశాల మేరకు పరిసరాల పరిశుభ్రత కోసం ప్రత్యేక ప్రచారం 4.0 కార్యాలయ స్పేస్ మేనేజ్మెంట్ అండ్ బ్యూటిఫికేషన్ సన్నాహదశ సెప్టెంబర్ 16 నుంచి 30 సెప్టెంబర్ వరకు అలాగే అమలు దశ అక్టోబర్ 02 నుంచి అక్టోబర్ 31 వ తారీకు వరకు ఏరియాలో వివిధ ప్రాంతాల్లో కాలనీలో డిపార్ట్మెంట్లలో శుభ్రం చేయడం జరుగుతుందని తెలిపారు, ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్కే పీ సివిల్ కార్యాలయంలో అధికారులు చెత్తను తొలగించి శుభ్రం చేశారు, ఈ కార్యక్రమంలో సివిల్ డివై ఎస్ ఈ ఎస్ శ్రీధర్, జెఈ దేవకుమార్, సీనియర్ సూపర్వైజర్ రబ్బ శ్రీనివాస్, సూపర్వైజర్ సమ్రాన్, సూపర్వైజర్ సదానందం పాల్గొన్నారు.

## చేతి వృత్తుల వారికి చేయూతనందించండి

### టీబీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజలింగు మోతే

### తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ



రామకృష్ణాపూర్ సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే) రెక్కాడితే గాని డొక్కాడని చేతివృత్తుల వారి పరిస్థితిని ఆలోచన చేయాలని, ఆర్థిక చేయూతనివ్వాలని తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం, టీబీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది డా. రాజలింగు మోతె తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శనివారం లేఖ రాశారు. తరతరాలుగా బడుగుజీవులు కులవృత్తిపై ఆధారపడి జీవనము కొనసాగిస్తున్నారని, రోజంతా కష్టపడి కులవృత్తి చేసిన కనీసం కడుపునిండా కూడా తినలేని పరిస్థితులవలన నేడు వారు కుల వృత్తులకు దూరమవుతున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు.ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు కూడా ప్రతి ఒక్కరికి అందడం లేదని లేఖలో తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలు కూడా విపరీతంగా పెరగడంతో చేతి వృత్తుల వారి పరిస్థితి దారుణంగా తయారయ్యిందన్నారు. ఎలాంటి హామీలు లేకుండానే ప్రభుత్వం అందించే రుణాలు కూడా వారికి దక్కని పరిస్థితులు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. చేతివృత్తుల వారి ఆర్థికాభివృద్ధి కోసం వివిధ కార్పొరేషన్ల ద్వారా అందించే నిధులతో పాటు, యంత్రాలు, పరికరాలు అందించి వారికి అండగా నిలవాలని లేఖలో ఆయన ముఖ్యమంత్రిని కోరారు.

# పరిపాలన దక్షుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**సంక్షేమ పథకాలు అందించడంతోపాటు అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం**

**ఐదేళ్లలో జగన్మోహన్ రెడ్డి చేసింది ఏమీ లేదు**

**శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ**



అనంత పురం సెప్టెంబర్ 21 వాయిస్ టుడే: ప్రజల భవిష్యత్తు కోసం పనిచేసే ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు.బుక్కరాయసముద్రం మండలం సంజీవపురం గ్రామంలోశనివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమానికి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిపాలన దక్షుడు అపార అనుభవం కలిగిన వ్యక్తి విజన్ ఉన్న నాయకుడు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితే ప్రజా పాలన ఏ విధంగా ఉంటుందో ఈ 100 రోజుల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన నిదర్శనం అన్నారు. పరిపాలన అనుభవం లేని జగన్ లాంటి వ్యక్తి ముఖ్యమంత్రి గా ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ ను అన్ని రంగాలను సర్వనాశనం చేశాడని పేర్కొన్నారు . కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు మెగా డీఎస్సీ ప్రకటన చేసినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వం మొట్ట మొదటిగా రాగానే సామాజిక పింఛన్లు రూ.3000 నుంచి ఒకే సారి రూ.4000 లకు ముఖ్యమంత్రి చంద్రబాబు పెంచి అత్యంత సాహొసోపేతమైన నిర్ణయం తీసుకున్నారనీ స్పష్టం చేశారు.

ప్రజల ఆందోళన చెందుతున్న వాటిలో ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసి ప్రజల ఆస్తులకు ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రత కల్పించారనీ తెలిపారు. అంతే కాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల 1న జీతాలు చెల్లింపు కార్యక్రమం చేపట్టారు. విజయవాడలో వరద బాధితులను కంటికి రెప్పలా కాపాడుతూ 10 రోజుల పాటు బస్సులో ఉండి ఓ తండ్రిలా ప్రజల్ని ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. నిరుద్యోగ యువతీ యువకులకు అండగా 16 వేల437 మందికి ఉద్యోగాలు కల్పించడానికి టీడీపీ ప్రభుత్వం మెగా డీఎస్సీ నీ ప్రకటించడం హర్షించదగ్గ శుభ పరిణామం అన్నారు. పేదల ఆకలి తీర్చడానికి ప్రభుత్వం అన్న క్యాంటీన్ ద్వారా రూ.5 లకే కడుపు నిండా నాణ్యమైన భోజనం అందించే బృహత్తర కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా 100 అన్న క్యాంటీన్ లకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. పంచాయతీలకు రూ. 1452 కోట్లు మంజూరు చేసి పంచాయతీలకు ప్రాణం పోసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది చంద్రన్న కూటమి ప్రభుత్వం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యం అన్నారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారని ప్రతి జిల్లాలోనూ కంపెనీలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్గా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు పసుపుల హనుమంత రెడ్డి, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, ఎంపీపీ దాసరి సునీత, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




## ప్రపంచ దేశాలలో అతిపెద్ద శక్తిగా భారత్

**మోడీ సారథ్యంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతుంది**

**చైనాలోని కమ్యూనిస్టు పార్టీ కంటే ఎక్కువ సభ్యత్వాలు చేయబోతున్నాం**

**- కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్**

వాయిస్ టుడే, ఉమ్మడి వరంగల్: నేడు ప్రపంచ దేశాలలో అతిపెద్ద శక్తిగా భారత్ ఎదుగుతుందని అని కేంద్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, ఫిషరీస్ మరియు మైనారిటీ వ్యవహారాల సహాయ మంత్రి జార్జ్ కురియన్ తెలిపారు. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏర్పాటుచేసిన బిజెపి సభ్యత్వ నమోదు అభియాన్ కార్యక్రమానికి కేంద్రమంత్రి జార్జ్ కురియన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ రెడ్డి అధ్యక్షతన హనుమకొండ బిజెపి పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ మెంబర్ షిప్ డ్రైవ్ నడుస్తుందని, ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ బిజెపి ఆవిర్భావం చెందుతున్నదని అన్నారు. ఈ యొక్క మెంబర్ షిప్ డ్రైవ్ కి నేను సౌత్ ఇండియా ఇంచార్జి గా వ్యవహరిస్తున్నాని మంత్రి తెలిపారు. ప్రపంచంలోనే 5 వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ దేశం ఉన్నదని, దీనిని టాప్-3 లోకి తేవడమే ప్రధాని మోడీ లక్ష్యం అని పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా ఉద్యమం ద్వార ప్రపంచ దేశాలలో భారత్ కు కొనుగోలు శక్తి, వస్తు డిమాండ్ పెరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 50 లక్షల మెంబెర్ షిప్ చేయడం లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నామని.. చైనా లోని కమ్యూనిస్టు పార్టీ కంటే ఎక్కువ సభ్యత్వాలు మేము చేయబోతున్నామని మంత్రి జార్జ్ కురియన్ అన్నారు. దేశంలోని యువత బిజెపి వెంట ఉందని కేంద్ర సహాయమంత్రి కురియన్ తెలియజేశారు. ఈ విలేకరుల సమావేశంలో బిజెపి నాయకులు మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, అరూరి రమేష్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, రాష్ట్ర నాయకులు డా.పేసరు విజయచందర్ రెడ్డి, గుజ్జ సత్యనారయణ రావు, డా.పగడాల కాళిప్రసాద్, పులి సర్రోత్తం రెడ్డి, చందుపట్ల రాజారెడ్డి, జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమ ఇంచార్జి గుండాగోని భరత్ గౌడ్, జిల్లా నాయకులు కొలను సంతోష్ రెడ్డి, కొండి జితేందర్ రెడ్డి, డి. అమర్నాథ్ రెడ్డి, గురిజల శ్రీరాం రెడ్డి, నర్మెట్ట శ్రీనివాస్, తోపుచేర్ల అర్చన మధు సుధన్ రావు, కందగట్ల సత్యనారయణ, సంద్ర మధు, చాంద్ పాషా, జైపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమానికి చిరునామా కొండా లక్ష్మణ్ బాపూజీ: దాస్యం



వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ రాష్ట్ర సాధన తొలి, మలిదశ ఉద్యమాల కేంద్రం, స్వరాష్ట్ర సాధన తెలంగాణ ఉద్యమానికి చిరునామ స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ అని మాజీ ఛీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శనివారం హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ యోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ కుసుమ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ కోసం మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా వదులుకున్న నిజమైన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని తెలిపారు. తెలంగాణ కోసం కేసీఆర్ నాటి టీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల నిర్వహణకు జలదృశ్యంలోని ఆయన ఇంటిని కేటాయించిన నిబద్ధత కలిగిన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని గుర్తు చేశారు. కేసీఆర్, జయశంకర్ లతో పాటు తెలంగాణ సమాజం కోసం జీవించిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని వినయ్ భాస్కర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్లు సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్, మర్రి యాదవ రెడ్డి, పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ జనార్ధన్ గౌడ్, పులి రజినీకాంత్ ముదిరాజ్, కార్పొరేటర్ సంకు నర్సింగ్, డివిజన్ అధ్యక్షులు కనకరాజు, సదాంత్, కోటేశ్వర్ రావు, విక్రమ్, మాజీ కార్పొరేటర్ ఉడతల సారంగపాణి, నాయకులు నయీమోద్దీన్, సుంచు కృష్ణ, పరుశురాములు, విజయ్, రాజు, శ్రీధర్ రావు, జానకి రాములు, మహమూద్, కిట్టు, ప్రణయ్, మహేష్, రఘు, హసన్పర్తి మండల నాయకలు పావుశెట్టి శ్రీధర్, రజినీకాంత్, కుమారస్వామి, విద్యార్థి నాయకులు బైరపాక ప్రశాంత్, గంద్రకోట రాకేష్ యాదవ్, వీర స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

**కక్షిదారులు వీలును బట్టి కేసులను రాజీ కుదుర్చుకోవాలి**

**రాజీపడదగు కక్షిదారులు తమ న్యాయవాదులతో హాజరుకావాలి**

**వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయమూర్తులు**




వాయిస్ టుడే, ఉమ్మడి వరంగల్: "గౌరవ జాతీయ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ" ల ఆదేశాలను అనుసరించి, వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఈనెల 28వ తేదీన శనివారం రోజున జాతీయ లోక్ అదాలత్ ను వరంగల్, హనుమకొండ జిల్లా కోర్టులలో మరియు నర్సంపేట, పరకాల మండల కోర్టులలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.వి.నిర్మలా గీతాంబ మరియు హనుమకొండ ఇంచార్జ్ ప్రధాన న్యాయమూర్తి బి.అపర్ణా దేవి తెలిపారు. శనివారం జిల్లా కోర్టులో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ప్రధాన న్యాయమూర్తులు మాట్లాడుతూ కక్షిదారులు తమ వీలును బట్టి తమ కేసులను రాజీ కుదుర్చుకోవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడదగు క్రిమినల్, సివిల్ కేసులు, భూ తగాదాల కేసులు, మోటార్ వెహికిల్ యాక్సిడెంట్ కేసులు, వివాహ మరియు కుటుంబ తగాదా కేసులు, బ్యాంకు, చెక్ బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్ ఫండ్, డిజాస్టర్ మేనేజ్మెంట్ కేసులు, ఇన్సూరెన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు, విద్యుత్ చోరీ, కన్స్యూమర్ ఫోరమ్ కేసులు, ట్రాఫిక్ ఈ-చాలన్ కేసులు మరియు ప్రీ- లిటిగేషన్ కేసులు మరియు ఇతర రాజీపడదగు కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ నందు కక్షిదారులు హాజరై తమ తమ కేసులను పరిష్కరించుకునేలా సిద్ధం కావాలని కోరారు.

జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడదగు కక్షిదారులు తమ తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టులలో తెలియపరిచి, రాజీ కుదుర్చుకుని, కోర్టుల చుట్టూ తిరగకుండా ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించాలని తెలియజేశారు. రాజీపడదగు కక్షిదారులు తమ న్యాయవాదులతో కోర్టులకు నేరుగా హాజరు కావాలని తెలియజేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయుటకు గాను ఇప్పటికే పోలీసు అధికారులతో, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతోనూ, ఎక్సైజ్ శాఖ అధికారులతో, ఇన్సూరెన్స్ అధికారులతోనూ, న్యాయవాదుల తోనూ, బ్యాంకు మరియు చిట్ ఫండ్ మేనేజర్లతో వేరు వేరు సమావేశాలు నిర్వహించి, అధిక కేసుల పరిష్కార దిశగా చర్యలు చేపట్టాం అని తెలిపారు. ఇప్పటివరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ లో గుర్తించబడిన కేసులలో మొత్తం 1477 రాజీపడదగు పెండింగ్ కేసులలోని కక్షిదారులకు నోటీసులు జారీ చేసి రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీటిలో క్రిమినల్ - 1366, ఎన్.ఐ యాక్ట్ - 19, ఎం.ఎ.సి.టి.- 55, ల్యాండ్ అక్విజిషన్ -04, మనీ రికవరీ-09, అదర్ సివిల్ -44, మరియు ప్రీ-లిటిగేషన్ ఎలక్ట్రిసిటి కేసులు- 2200, బ్యాంక్ కేసులు- 1451, బి.ఎస్.యన్.ఎల్. కేసులు-212 అని తెలిపారు. రాజీ పడదగు కక్షిదారులు తమ వీలును బట్టి తమ కేసులను సాయంత్రం 5.00 గంటలలోపు ఏ రోజైనా రాజీ కుదుర్చుకునేలా ప్రీ-లోక్ అదాలత్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ప్రీ-లోక్ అదాలత్ లో ప్రీ-లిటిగేషన్ కేసులు మరియు ఇతర రాజీపడదగు కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్, ప్రి-లోక్ అదాలత్ పట్ల ఎటువంటి సలహాలకైననూ, సందేహాలకైననూ, ఏదేని న్యాయసహాయం కొరకు అయిననూ న్యాయసేవాధికార సంస్థ ను ఆశ్రయించి, ఉచిత న్యాయ సలహాలు, సూచనలు పొందవలసిందిగా తెలియజేస్తున్నామన్నారు.

# ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులుగా లక్ష్మి, జ్యోతి ఎన్నిక





కొత్తగూడెం, సెప్టెంబర్ 21 (వాయిస్ టుడే): అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) భద్రాద్రి జిల్లా నూతన కార్యవర్గం ను ఎన్నుకున్నారు. భద్రాచలం లో జరిగిన ఐద్వా మూడవ మహాసభ లో 41 మందితో నూతన కమిటీ ఎన్నుకున్నట్లు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ ప్రకటన లో తెలిపారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలిగా డి. సీతామహాలక్ష్మి, కార్యదర్శిగా మందలపు జ్యోతి ఎన్నికయారు. మహాసభ లో పలు మహిళా అంశాలపై తీర్మానాలు చేసినట్లు తెలిపారు. మహిళల హక్కుల పరిరక్షణ, బాలికల విద్యకు విఘాతం కలిగించే నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. అలాగే అధిక ధరలను అరికట్టాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని, మద్యం, మత్తు మందులను నియంత్రించాలని, ప్రజాస్వామ్య హక్కులపై దాడి, నిర్బంధాలు ఆపాలని పలు తీర్మానాలు చేసినట్లు తెలిపారు. మహిళల సమస్యలు పరిష్కరించేలా మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వాలు కార్యాచరణ ఉండాలని ఐద్వా డిమాండ్ చేస్తుందన్నారు. మహిళా సంక్షేమానికి, ఉపాధి కల్పనకు బడ్జెట్లో మూడో వంతు కేటాయించాలనే తీర్మానాన్ని చేసారు, విస్తారమైన శక్తిగా ఉన్న పొదుపు మహిళలకు ప్రభుత్వ సహకారం పెరగాలని తీర్మానించారు. పురుషులతోపాటు ఉ సాధి, సమాన వేతనం కల్పించే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు, మద్యనిషేధ వాగ్దానానికి కట్టుబడి ఉండాలని, రాజ్యాంగ స్ఫూర్తిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల నాయకత్వంలో అభివృద్ధి సాధించాలనే జి20 పిలుపును అమలు చేసేందుకు సమూల మార్పులు అవసరమని, దీనికి రాజకీయ పార్టీలు ముందుకు రావాలని కోరారు, మహిళల దుస్థితి మారాలని, సాధికారత రావాలని తెలిపారు. మహిళా సమస్యలను ఆయా పార్టీలు తమ ప్రణాళికలో చేర్చాలని, వాటిపై ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ తీర్మానాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. 2018-19లో మహిళలు ఉపాధిలో 21.9 శాతం మంది ఉంటే 2022-23లో 15.9 శాతానికి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. 90 శాతం నుంది మహిళల అసంఘటిత రంగంలో ఉంటూ హీనమైన వేతనంతో పనిచేస్తున్నారని తెలిపారు.



## కోనోకార్పస్ చెట్లను తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రతినిధి సెప్టెంబర్ 21 2024 (వాయిస్ టుడే) : బెల్లంపల్లి పట్టణంలో ప్రజలకు హాని కలిగిస్తున్న కోనోకార్పస్ చెట్లను తొలగించాలని కోరుతూ యు ఎఫ్ ఆర్ టి ఐ బెల్లంపల్లి నియోజకవర్గ కో కన్వీనర్ బి.సాగర్ వర్మ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. డివైడర్లపై ఈ విషపూరితమైన చెట్లు ఉండటం వలన ప్రజలకు హాని కలుగుతుంది. ఈ చెట్లు వాతావరణాన్ని కలుషితం చేయడంతో పాటు వాతావరణం మార్పులకు కూడా కారణం అవుతున్నాయి. పలు దేశాలలో ఈ చెట్లను నిషేధించినట్లు సమాచారం. బెల్లంపల్లి పట్టణంలో కూడా ఈ చెట్లను తొలగించాలని కోరుతూ కోనోకార్పస్ మొక్కల స్థానంలో ఏదైనా ఆక్సిజన్ అందించే వాతావరణ సహిత మొక్కలు నాటవలసిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గ కన్వీనర్ కోట నరేష్, కమిటీ సభ్యుడు పి కనకరాజు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి మిల్లు యజమాని టోకరా

### రూ. 8.36 కోట్ల విలువైన ధాన్యం మాయం

కురవి: మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మొగిలిచర్ల శివారులోని నవ్య పారా బాయిల్డ్ రైస్ మిల్లు యజమాని రూ. 8.36 కోట్ల విలువైన 34,274 క్వింటాళ్ల ధాన్యాన్ని పక్కదారి పట్టించారు. రైస్ మిల్లులో శనివారం పౌర సరఫరాల శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన దాడుల్లో ఈ విషయం వెలుగు చూసింది. 2022-23 సీజన్‌లో పౌర సరఫరాల శాఖ వివిధ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేసిన 53,560 క్వింటాళ్ళ ధాన్యాన్ని మిల్లుకు తరలించారు. ఆ ధాన్యాన్ని మరాడించి 36,420 క్వింటాళ్ళ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. కానీ మిల్లరు కేవలం 8,871 క్వింటాళ్ల బియ్యం మాత్రమే ప్రభుత్వానికి అప్పగించారు. ఇంకా మరాడించని 40,513 క్వింటాళ్ళ ధాన్యం నిల్వ ఉండాలి. ప్రస్తుతం కేవలం 6,238 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే నిల్వ ఉన్నట్లు చూపారు. మిల్లు నిర్వాహకుడు వివిధ కారణాలను చూపుతూ రూ. 8.36 కోట్ల విలువైన ధాన్యాన్ని పక్కదారి పట్టించి ప్రభుత్వాన్ని మోసగించారని పౌరసరఫరాల శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ఎం.ప్రభాకర్ వెల్లడించారు. కురవి పోలీస్‌స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



## రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ



ఖమ్మం క్రీడలు: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఇటీవల హైదరాబాదులో జరిగాయి. జిల్లాకు చెందిన బాలికలు వైశాలి, మనుశ్రీ పతకాల పంట పండించారు. అండర్-16 లాంగ్‌జంప్, పెంటథ్లాన్ పోటీల్లో వైశాలి రెండు బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. మనుశ్రీ 600 మీటర్ల పరుగు, పెంటథ్లాన్ పోటీల్లో రెండు కాంస్య పతకాలు అందుకున్నారు. పటేల్ స్టేడియంలోని అథ్లెటిక్స్ కేంద్రంలో శిక్షణ పొందుతున్న ఈ బాలికలు రాష్ట్ర టోర్నీలో ప్రతిభ చాటారు. అథ్లెటిక్స్ రంగంలో రాణించే వారు ఈ విభాగాన్ని దాదాపు ఎంచుకోరు. ఇందులో అయిదు విభాగాల్లో ఫలితం సాధించాల్సి ఉంటుంది. 60, 600 మీటర్ల పరుగు, 80 మీటర్ల హర్డిల్స్ పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్ వీటన్నింటిలో గెలుపొందాల్సి ఉంటుంది. ఈ అంశాన్ని ఎంచుకున్న బాలికలు వైశాలి 3,562 పాయింట్లతో ప్రథమ స్థానం దక్కించుకోగా.. మనుశ్రీ 2,992 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఇద్దరు బాలికలూ పతకాల పట్టికలో ముందుండటం విశేషం.

## ప్రాణం తీసిన భూ వివాదం

### హత్య కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

పెద్దపల్లి కలెక్టరేట్: దాయాదుల మధ్య భూ తగదాలు ఒకరి ప్రాణం తీశాయి. పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో ఈ నెల 19న జరిగిన హత్య కేసులో ప్రధాన నిందితుడిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ జి.కృష్ణ పెద్దపల్లి స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. కొత్తపల్లికి చెందిన కలవేన రాజేశం(68)తో దాయాదులు కలవేన లక్ష్మయ్య, మల్లయ్య, రాజయ్యలకు 15 ఏళ్లుగా 2.32 ఎకరాలకు సంబంధించి భూ వివాదం ఉండగా ఇటీవల పరిష్కారమైంది. మరో పది గుంటల భూమి వివాదం న్యాయస్థానం పరిధిలో ఉంది. సింగరేణి విశ్రాంత ఉద్యోగి అయిన లక్ష్మయ్య మంచిర్యాల జిల్లా నస్పూర్‌కాలనీలోని తీగల్‌పహాడ్‌లో నివాసముంటున్నాడు. అతడి సోదరులు మల్లయ్య, రాజయ్య స్వగ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ నెల 19న తల్లి అనారోగ్యంతో బాధ పడుతోందని సోదరులు చెప్పడంతో లక్ష్మయ్య మందులు తీసుకొని కొత్తపల్లి వచ్చాడు. ఇంట్లో భూ వివాదం ప్రస్తావ-నకు రావడంతో రాజేశం హత్యకు సోదరులు పథకం పన్నారు. అదే రోజు రాజేశం భూ సర్వే కోసం పొలం వద్ద వేచి చూస్తున్నాడని తెలుసుకొని ముగ్గురూ అక్కడికి వెళ్లారు. సర్వే అనంతరం ఇంటికి వెళ్లడానికి ద్విచక్రవాహనం వద్దకు వెళ్లిన రాజేశంపై లక్ష్మయ్య వెంట తెచ్చుకున్న కర్రతో దాడి చేశాడు. వాహనం ఎక్కి తప్పించుకునే యత్నం చేయగా మల్లయ్య కూడా వచ్చి లక్ష్మయ్యతో కలిసి దాడికి పాల్పడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. వీరి సోదరుడు రాజయ్య ఘటనా స్థలం వద్ద కాపలా కాసి నిందితులు పారిపోయేందుకు సహకరించాడు. మృతుడి కుమారుడు సాయిక్రిష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. లక్ష్మయ్యను అరెస్టు చేయగా మల్లయ్య, రాజయ్య పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు. సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు. నిందితులు హత్యకు వినియోగించిన ద్విచక్రవాహనం, కర్ర, రక్తపు మరకలతో ఉన్న దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# భారాస నాయకుల అరెస్టు కలకలం

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ర్యాలీని అడ్డుకున్న పోలీసులు



దేవరుప్పుల రూరల్: ఇద్దరు భారాస నాయకుల అరెస్టు జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో కలకలం రేపింది. వారికి అండగా పార్టీ నాయకులు దేవరుప్పుల భారాస మండల పార్టీ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు తలపెట్టిన నిరసన ర్యాలీలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొన్నారు. ర్యాలీని తొలుత జఫర్‌గడ్ ఎస్సై రామ్‌చరణ్, పాలకుర్తి ఎస్సై సాయి ప్రసన్నకుమార్ అడ్డుకుని మాజీ మంత్రి దయాకర్‌రావును ఉన్నతాధికారులతో మాట్లాడించే ప్రయత్నం చేసినా ఫలితం కనిపించలేదు. అనంతరం ర్యాలీ ప్రదేశానికి వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య చేరుకుని సీపీ, డీసీపీతో చరవాణిలో మాట్లాడించారు. బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి, పూర్తిస్థాయిలో సమాచారాన్ని సేకరించడానికి సోమవారం వరకు సమయం కావాలని సీపీ కోరడంతో కామారెడ్డిగూడెం శివారులో నిరసన ర్యాలీని విరమించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ భారాస నాయకుల అరెస్టు వెనుక కాంగ్రెస్ నేతల హస్తం ఉందని ఆరోపించారు. చిన్నమడూరు మాజీ సర్పంచి వంగ పద్మ కుమారుడు వంగ అర్జున్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సుజాత భర్త గొడుగు మల్లికార్జున్‌లను ఓ వెంచర్ లావాదేవీల విషయంలో ఇతర భాగస్వాముల ద్వారా కాంగ్రెస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసులు నమోదు చేయించారన్నారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో స్టేషన్ బెయిల్ రాకుండా చేసి జైలుకు పంపించారన్నారు.. పోలీసులు ఇచ్చిన సోమవారం గడువుతో పాటు ఈ నెల 26 వరకు వేచి చూస్తామని, అరెస్టు చేసిన భారాస నాయకులను విడుదల చేసి, వెంచర్ యాజమానిని కిడ్నాప్ చేసి అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై కేసులు నమోదు చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర నాయకులు కేటీఆర్, హరీష్‌రావుతో సహా జిల్లా నాయకులతో రాష్ట్రవ్యాప్త నిరసనలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం అక్రమాలకు పాల్పడడమే కాకుండా.. ఇటీవల వెంచర్ యాజమాని పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయాలని ఎస్సై సృజన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

#### ఇద్దరు భారాస నాయకులకు 14 రోజుల రిమాండ్

అంతకు ముందు ఇద్దరు భారాస నాయకులను ఓ వెంచర్ యాజమానిని బెదిరించి వసూళ్లకు పాల్పడినట్లు నమోదైన కేసులో పోలీసులు అరెస్టు చేసి జనగామ కోర్టు ముందు హాజరుపర్చారు. వారికి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలం చిన్నమడూరు మాజీ సర్పంచి వంగ పద్మ కుమారుడు వంగ అర్జున్, మాజీ ఎంపీటీసీ సభ్యురాలి భర్త గొడుగు మల్లికార్జున్.. రూ. 9.25 లక్షల నగదును ఫోన్‌పే, అకౌంట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా తీసుకుని ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించినట్లు వెంచర్ యాజమాని ఉమామహేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



## లక్కీ యూత్ అసోసియేషన్ ఘనంగా గణేష్ నిమజ్జనం

### లడ్డూ వేలం పాటలో 65000వేలకు మహా ప్రసాదం లడ్డూను కైవసం చేసుకున్న గుండ్లపల్లి హరిబాబు దంపతులు

వాయిస్ టుడే/ యాదగిరిగుట్ట:లక్కీ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన ఉత్సవం సందర్భంగా యాదగిరిగుట్ట గుండ్లపల్లి గణేష్ మండపాల వద్ద లడ్డు వేలం పాట హోరాహోరీగా సాగింది..65000 వేలకు గణపతి లడ్డూను దక్కించుకున్న గుండ్లపల్లి హరిబాబు దంపతులు..కమిటీ సభ్యులు హరిబాబు దంపతులు లకు శాలువాతో ఘనంగా సన్మానించి మహా ప్రసాదం లడ్డూను అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్కీ యూత్ సభ్యులు కుమార్,కిషోర్,ఎల్లేష్,చిరంజీవి,రాజు,నవీన్,శ్రీను,బాలకృష్ణ, కాలనీ వాసులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.




## స్వచ్ఛతా హి సేవలో భాగంగా నిట్ లో కార్యక్రమాలు

### అక్టోబర్ 2వ తేదీ వరకు పలు కార్యక్రమాలు

వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించే స్వచ్ఛతా హి సేవా ప్రచారంలో భాగంగా ఎన్ఐటి (నిట్) వరంగల్ వరుస కార్యక్రమాలను నిర్వహిస్తోంది. శనివారం ఉదయం పరిశుభ్రత టార్గెట్ యూనిట్లు, శ్రమదానం ద్వారా క్యాంపస్‌లోని స్థలాలను శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. గుర్తించిన స్థలాల్లో ఎన్ఐటి (నిట్) వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని స్థలాలను శుభ్రం చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. ఎన్ఐటీ(నిట్) వరంగల్ స్వచ్ఛతా హి సేవలో భాగంగా అక్టోబర్ 2వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి ప్రొఫెసర్ ఎస్.శంకర్ తెలిపారు. "మేము ఏక్ పద్ ఏక్ నామ్, పోస్టర్ డిజైన్ పోటీలు, క్లీనింగ్ డ్రైవ్‌లు నిర్వహించామన్నారు. పరిశు భ్రమైన దేశం యొక్క ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం అని ప్రొఫెసర్ ఎస్.శంకర్ తెలియజేశారు.



## బోర్డు డైరెక్టర్ల సమావేశంలో పాల్గొన్న టేస్కాబ్ చైర్మన్

వాయిస్ టుడే, వరంగల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ లిమిటెడ్ 78 వ బోర్డు డైరెక్టర్ల సమావేశం శనివారం తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం హనుమకొండలో నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆర్థిక లావాదేవీలపై, టర్నోవర్స్, బ్యాంక్ పురోగతి, ఐటి రంగం, నెట్ వర్క్, డిపాజిట్స్ ఎడ్యుకేషనల్ అవర్నెస్, ఆర్బీఐ మరియు నాబార్డ్ సర్కులర్ల అమలు, రైతు రుణ మాఫీ లపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కొత్త కురుమ సత్తయ్య, డైరక్టర్లు, రవీందర్ రావు, చిట్టి దేవేందర్ రెడ్డి, కంభం శ్రీనివాస్ రెడ్డి, అడ్డీ బోజా రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర రావు, రమేష్ రెడ్డి, ప్రొఫెషనల్ డైరక్టర్లు మోహనయ్య, శ్రీనివాసులు రెడ్డి, టేస్కాబ్ ఎం.డి గోపి, అడిషనల్ రిజిస్ట్రార్ శ్రీనివాస్, నాబార్డ్ సీజిఏం చింతల సుశీల, టేస్కాబ్ సీజిఏం జ్యోతి పాల్గొన్నారు.

## పాతబస్తీలో వ్యక్తి కిడ్నాప్.. హత్యాయత్నం

హైదరాబాద్(పాతబస్తీ) : తన భర్త, కుమారుడితో కలిసి ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడిందో మహిళ. ఈ ఘటన హైదరాబాద్ పాతబస్తీ సమీపంలోని బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ ఇస్మాయిల్ నగర్‌కు చెందిన ఐజాజ్ క్యాబ్ డ్రైవర్. తనతో మాట్లాడాలని చెప్పి ఐజాజ్‌ను ఓ మహిళ ఆటోలో తీసుకెళ్లింది. లేక్‌వ్యూ హిల్స్ సమీపంలో ఓ నిర్మానుష్య ప్రదేశానికి వెళ్లిన తర్వాత ఆ మహిళ తన భర్త, కుమారుడితో కలిసి ఐజాజ్‌పై బండరాళ్లతో దాడికి పాల్పడింది. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. ఐజాజ్ రక్తపుగాయాలతో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని అతన్ని స్థానిక ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్, హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు.